ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి



విద్యార్థులకు ట్రావెల్ అలవెన్సు

» లెక్కతేల్చే పనిలో సమగ్రశిక్ష అధికారులు

ఏలూరు అర్బన్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): దూర ప్రాంతాల నుంచి ప్రభుత్వ పాఠశాలలకు రాకపోకలు సాగించే బాలబాలికలకు రవాణాభత్యం (ట్రావెల్ అలవెన్సు) ఇవ్వాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో జిల్లాలో అర్హులైన విద్యార్థులను గుర్తించే ప్రక్రియను సమగ్రశిక్ష జిల్లా అధికారులు శుక్రవారం ప్రారంభించారు. ప్రస్తుత విద్యాసంవత్సరం నుంచి ప్రారంభమైన తొమ్మిది రకాల పాఠశాలల పునర్వ్యవస్థీకరణ విధానంలో జిల్లాలో సుమారు మూడువేల మంది విద్యార్థులకు రవాణా భత్యం ఇవ్వాల్సి ఉంటుందని తొలుత లెక్కతేల్చారు. ఈ ఏడాది జూన్ 12 నుంచి పాఠశాలలు పునఃప్రారంభమైన తర్వాత పలుచోట్ల తొలుత వేసిన అంచనాల మేరకు ఆయా స్కూళ్లలో సంబంధిత విద్యార్థులు లేకపోవడం లేదా ఇతర ప్రాంతాలకు వెళ్లిపోవడం లేదా మరో పాఠశాలలో చేరడం, తదితర మార్పులు జరిగినట్టు గుర్తించారు. దీంతో రవాణాభత్యం అందజేసేందుకు అర్హులైన విద్యార్థుల సంఖ్యలో సమగ్రత లోపించింది. ఈ నేపథ్యంలో ఈనెల 8 లోగా జిల్లాలోని అన్ని మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న బాలబాలికలు ఇంటినుంచి ఎంతదూరం ప్రయాణించి స్కూలు వస్తున్నదీ వివరాలను సేకరించడానికి ప్రభుత్వం గడువు విధించింది. ఆ ప్రకారం రవాణాభత్యానికి ఎంపికైన విద్యార్థికి నెలకు రూ.600 చొప్పున పదినెలల కాలానికి ప్రభుత్వం విద్యార్థి తల్లి బ్యాంకు ఖాతాకు జమ చేస్తుంది. ఇంటినుంచి పాఠశాలకు ఒక కిలో మీటరు పైబడి దూరం నుంచి వచ్చే 1-5 తరగతులు విద్యార్థులతోపాటు, మూడు కిలోమీటర్ల పైబడి దూరం నుంచి వచ్చే ప్రాథమికోన్నత తరగతుల (6,7,8) విద్యార్థులకు రవాణా భత్యాన్ని ప్రతీ మూడునెలలకోసారి బ్యాంకు ఖాతాకు జమ చేయనున్నారు.

పాఠశాలల్లోకి అనధికార వ్యక్తుల ప్రవేశంపై నిషేధం

పాఠశాలల్లో బోధనా కార్యకలాపాలకు విఘాతం కలిగించేలా స్కూలు ప్రాంగణంలోకి అనధికార వ్యక్తులు లేదా సంస్థలకు అనుమతివ్వరాదని విద్యాశాఖ ఉన్నతాధికారులు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. విద్యార్థులు, పాఠశాలలకు బహుమతులు లేదా విరాళాల పేరిట అనధికార వ్యక్తులు/సంస్థలు ప్రాంగణంలోకి ప్రవేశించడాన్ని ఇకమీదట నిలువరించాలని ఆదేశించారు. విద్యార్థుల తల్లిదండ్రులు లేదా ఎస్ఎంసీ సభ్యులు మినహా మిగతావారెవ్వరినీ ప్రాంగణాల్లోకి అనుమతించవద్దని సూచించారు. స్కూలు ప్రాంగణంలో రాజకీయ పార్టీలకు లేదా సంస్థలకు చెందిన గుర్తులు, జెండాలు, బ్యానర్లు, పోస్టర్లు ఉంచడంపై నిషేధాన్ని విధిస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ మార్గదర్శకాలను అమలు చేయాల్సిన బాధ్యత హెచ్ఎంలపైనే ఉంటుందని స్పష్టం చేశారు.

కొండలరావుపాలెంలో.. హై టెన్షన్

» కొల్లేరు వాసుల నిరసన పిలుపుతో పోలీసులు అప్రమత్తం

» మాజీ ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి ఇంటి వద్ద భారీ బందోబస్తు

■ లోపలి పేజీలో..



ఇల్లా..స్థలమా!

అన్ని వర్గాలకు చేరువకావడం కూటమి లక్ష్యాల్లో ఒక భాగం. ఈనెల శ్రావణమాసం సందర్భంగా గృహ ప్రవేశాలకు పక్కా ఇళ్లల్లో అవకాశం కల్పిస్తారా.. లేక ముందస్తుగా కసరత్తు చేస్తున్నట్టుగా కొత్తగా కోరుకున్న వారికి పట్టాలు ఇస్తారా అనేదే టెన్షన్. తెలుగుదేశం ప్రభుత్వం తన హామీల్లో ఒక్కొక్కటిగా అమలు చేస్తూ వస్తోంది. చాన్నాళ్లుగా పూర్తయిన పక్కా గృహాలు తమ సొంతం కావాలని లబ్ధిదారులు ఆశగా ఎదురు చూస్తున్నారు. ఇంకోవైపు కొత్తగా ఇళ్ల పట్టాలు అర్హులైన వారికి అందించేందుకు దరఖాస్తులు కోరారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే ఆరు వేలకుపైగా అందాయి. వీటి పరిశీలన దాదాపు పూర్తి కావచ్చింది. ఇప్పుడు అందరి దృష్టి పక్కా ఇళ్లల్లో ప్రవేశాలకు అవకాశం ఉందా.. కొత్తగా ఇంటి జాగాల జాబితాలో తమ పేరు చేరుతుందా, లేదా అనేదే ఉత్కంఠ.

» శ్రావణం వచ్చింది పెద్దల మాటేంటి..
» ఇస్తామన్న ఇళ్లు..జాగాలు ఈసారైనా దక్కేనా
» 30 వేల ఇళ్లల్లో ప్రవేశాలకు లబ్ధిదారుల ఆతృత
» ఆరు వేల మందికిపైగా కొత్త జాగాలకు దరఖాస్తులు
» ఈనెలలో అనుకున్నది జరిగితే పేదల పంట పండినట్టే



(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిపైనే దాటింది. ఇప్పటికే సూపర్-6 పేరిట ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలులోకి తెస్తున్నారు. చాన్నాళ్ల క్రితం నిర్మించి వదిలేసిన పక్కా గృహాలను పేదల పరం చేయాలని ఇప్పటికే ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లా వ్యాప్తంగా గత ఐదేళ్లల్లో లక్షకు పైగా గృహాలు మంజూరుకాగా వాటిలో కేవలం ఇప్పటివరకు 35 వేలకుపైగా ఇళ్లు నివాసయోగ్యంగా నిర్మాణం పూర్తయ్యింది. తెలుగుదేశం ప్రభుత్వం అధికార పగ్గాలు చేపట్టిన తర్వాత తొలుత టిడ్కో ఇళ్లపై ఫోకస్ పెట్టారు. జిల్లాలో 11 వేలకు పైగా టిడ్కో ఇళ్లు మంజూరుకాగా వీటిలో కొన్ని మాత్రమే నూజివీడు, జంగారెడ్డిగూడెం, ఏలూరులలో పూర్తయినా ఇప్పటికీ దిక్కుమొక్కులేదు. జగన్ ప్రభుత్వం టిడ్కో ఇళ్లను జంతువుల ఆవాసంగా మార్చింది. ముళ్లపొదలతో నిండి విష పురుగులమయమైన ఈ కాలనీల వైపు కన్నెత్తి చూసేవారు లేరు. ఇలాంటి క్రమంలోనే టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే ఇంతకుముందు అర్హులుగా గుర్తించిన వారికే టిడ్కో ఇళ్ల కేటాయింపు జరుగుతుందని స్పష్టం చేస్తూ వచ్చారు. ఇంకోవైపు ఎన్టీఆర్ కాలనీ (జగనన్న కాలనీ)ల్లో పూర్తయ్యి ఇప్పటికీ లబ్ధిదారులకు అందించని ఇళ్ల సంఖ్య వేలల్లోనే ఉంది. ఈ పరిస్థితుల్లో ఆచితూచి అడుగేయాల్సింది పోయి సాధ్యమైనంత మేర శ్రావణమాసంలో ఈ తరహా పక్కా ఇళ్లల్లో గృహ ప్రవేశాలకు అనువైన పరిస్థితులు ఉంటే నిర్దేశిత నిర్ణయం తీసుకుంటామని పదేపదే ప్రభుత్వ పెద్దలు చెబుతూ వచ్చారు. శ్రావణ మాసం రానేవచ్చింది. కొత్త ఇంట్లోకి వెళ్లేది ఎప్పుడంటూ పేద వర్గాలు ఆరాటపడుతున్నారు. ఈసారి గనుక ముహూర్తం తప్పితే మరో అవకాశం తమకు రాదేమోనన్న బెంగ, భయం వారిలో కనిపిస్తున్నాయి. మొత్తం పూర్తయ్యి ఖాళీగా ఉంటున్న ఇళ్లల్లో కొన్నిచోట్ల ఎవరు ఇష్టం వచ్చినట్టు వారు అడ్డదారులను వినియోగించుకుంటున్నారు. అసాంఘిక కార్యకలాపాలకు ఈ కాలనీల పరిసరాలు ఆలవాలమయ్యాయి.

ఇళ్ల స్థలాల సంగతేంటి

పక్కా గృహాల నిర్మాణం సాగుతుండగానే ఇంకోవైపు అర్హులైన పేద వర్గాల నుంచి మూడు సెంట్లు చొప్పున ఇంటి జాగా ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ మేర కు ఇప్పటికే దరఖాస్తులను ఆహ్వానించారు. గత నెలాఖరు వరకు జిల్లా వ్యాప్తంగా 6, 514 దరఖాస్తులు అందాయి. ఏలూరు డివిజన్ నుంచి 3,020, జంగా రెడ్డిగూడెం డివిజన్ నుంచి 552, నూజివీడు డివిజన్ నుంచి 2,936 దరఖాస్తులు అందగా వీటి పరిశీలన దాదాపు పూర్తి

(మిగతా 6వ పేజీలో)

92 శాతం పింఛన్ల పంపిణీ

ఏలూరు సిటీ, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి):జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పింఛన్‌లు పంపిణీ తొలిరోజైన శుక్రవారం 92 శాతం పూర్తి చేశారు. సచివాలయ సిబ్బంది పింఛన్ల పంపిణీని ఉదయం 7 గంటలకే ప్రారంభించారు. జిల్లాలో మొత్తం 2,61,592 మంది లబ్ధిదారులు ఉండగా రూ.114.25 కోట్లు నిధులను పంపిణీకి విడుదల చేయగా శుక్రవారం సాయంత్రం ఆరు గంటల సమయానికి జిల్లాలో 2,40,196 మంది అంటే 92 శాతం మందికి రూ.104.47 కోట్లు అందజేశారు. ఇంకా 21,396 మందికి పంపిణీ చేయాల్సి ఉంది. రెండో తేదీ సాయంత్రంలోగా అందుబాటులో వున్న పింఛన్ దారులకు అందజేసి నూరుశాతం పూర్తి చేస్తామని డీఆర్‌డీఏ పీడీ విజయరాజు తెలిపారు. ఏలూరు నగరంలోని 37, 38 డివిజన్లలోని ఆర్‌ఆర్‌పేట, గుబ్బలవారి వీధిలో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని కలెక్టర్ వెట్రిసెల్వి పరిశీలించి కొంతమంది లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లను పంపిణీ చేశారు. జిల్లాలో కొత్తగా 4,358 స్పౌజ్ పింఛన్‌లను ప్రభుత్వం మంజూరు చేసిందని, వాటిని ఈ నెలలో పంపిణీ చేస్తామన్నారు. డీఆర్‌డీఏ పీడీ విజయరాజు, కమిషనర్ భానుప్రతాప్, తహసీల్దార్ గాయత్రీ స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



ఆగిరిపల్లి మండలం తోటపల్లిలో పింఛన్ అందజేస్తున్న మంత్రి కొలుసు పార్థసారథి

నేడు అన్నదాత సుఖీభవ నిధులు జమ

» జిల్లాలో 1,60,968 రైతులకు రూ. 112,67,76,000 కోట్లు లబ్ధి

ఏలూరు సిటీ, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): టీడీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలిసారిగా అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు సాయం అందించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆగస్టు 2వతేదీ శనివారం అన్నదాత సుఖీభవ కింద తొలి విడతగా రూ.ఐదు వేలు, పీఎం కిసాన్ కింద 20వ విడత సొమ్ములు రూ.రెండు వేలు కలిపి మొత్తం రూ.ఏడు వేలు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ కానున్నాయి. జిల్లాలో లక్షా 60వేల 968 మంది రైతులకు రూ.112.67 కోట్లు జమ చేయనున్నారు. ఏడాదికి అన్నదాత సుఖీభవ కింద రూ.14 వేలు, పీఎం కిసాన్ కింద రూ. ఆరువేలు మొత్తం రూ.20 వేలు అర్హులైన రైతులకు అందించనున్నారు. అయితే కౌలు రైతులకు రాష్ట్ర ప్రభుత్వమే నేరుగా అన్నదాత సుఖీభవ కింద రూ.20వేలు పెట్టుబడి సాయం అందించనుంది. గత ప్రభుత్వ హయాంలో రైతు భరోసా కింద కేవలం రూ.13,500 (రైతుభరోసా రూ.7,500, పీఎం కిసాన్ రూ. 6వేలు) మాత్రమే ఇచ్చారు. అదీకూడా కొంత మంది రైతులకే ఈ ప్రయోజనం చేకూరిందనే విమర్శలు ఆనాడు వినిపించాయి.

లబ్ధి పొందే రైతులు..కేటాయించిన నిధులు

మండలం పేరు	రైతుల సంఖ్య	అన్నదాత సుఖీభవ నిధులు (కోట్లలో)	పీఎం కిసాన్ నిధులు (కోట్లలో)	మొత్తం నిధులు (కోట్లలో)
చింతలపూడి	12,383	6.19	1.91	8.10
లింగపాలెం	8,244	4.12	1.48	5.60
జంగారెడ్డిగూడెం	8,182	4.09	1.37	5.46
కామవరపుకోట	8,009	4	1.38	5.38
పెదవేగి	9,285	4.64	1.38	6.02
దెందులూరు	5,905	2.95	1.01	3.96
పెదపాడు	4,760	2.38	0.79	3.17
ఏలూరు	2,162	1.08	0.38	1.46
ద్వారకాతిరుమల	9,651	4.83	1.27	6.10
ముదినేపల్లి	4,909	2.45	0.85	3.30
మండవల్లి	1,997	1	0.32	1.31
కైకలూరు	1,234	0.62	0.24	0.85
కలిదిండి	771	0.39	0.13	0.52
ఆగిరిపల్లి	10,009	5	1.61	6.62
నూజివీడు	9,240	4.62	1.50	6.12
ముసునూరు	8,205	4.10	1.46	5.56
చాట్రాయి	8,075	4.04	1.29	5.33
టి నరసాపురం	9,114	4.56	1.55	6.10
కొయ్యలగూడెం	8,304	4.15	1.45	5.60
బుట్టాయిగూడెం	6,096	3.05	1.14	4.19
పోలవరం	5,002	2.50	0.83	3.33
జీలుగుమిల్లి	3,284	1.64	0.36	2.01
కుక్కునూరు	1,669	0.83	0.30	1.13
వేలేరుపాడు	568	0.28	0.12	0.41
ఉంగుటూరు	8,111	4.06	1.32	5.37
భీమడోలు	3,589	1.79	0.66	2.46
నిడమర్రు	2,210	1.11	0.49	1.60



కుక్కునూరులో ఆరబెట్టిన మిర్చి

అమ్మో..మిర్చా!

» కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో సాగు చేసేందుకు రైతుల అనాసక్తి
» వరుస నష్టాలు.. పెట్టుబడులు రాని వైనం
» గతంలో పదివేల ఎకరాల్లో సాగు.. నేడు వెయ్యి ఎకరాల్లోపే..
» ప్రత్యామ్నాయంగా జామాయిల్, అరటి సాగుకు మొగ్గు

కుక్కునూరు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలోని కుక్కునూరు, వేలేరుపాడు మండలాలు నాణ్యమైన మిర్చి పంటకు ప్రసిద్ధి. ఇక్కడ పండే మిర్చి మార్కెట్‌లోకి వెళ్తే కనీసంగా రూ.500 నుంచి రూ.1000 అదనంగా వ్యాపారులు చెల్లించేవారు.మంచి దిగుబడి, ఆశాజనకంగా ధర, మిర్చి రైతాంగానికి లాభసాటిగా ఉండేది. నేడు పరిస్థితులు మారాయి. ఒకప్పుడు దాదాపుగా పదివేల ఎకరాలకు పైగా మిర్చిని సాగు చేసేవారు. ప్రకృతి వైపరీత్యాలు, వాతావరణం అనుకూలించకపోవడం, పంటపై వైరస్ దాడులు, పెరిగిన పెట్టుబడి, గిట్టుబాటు ధర లేక రైతులు నష్టపోతున్నారు. దీంతో మిర్చిసాగు అంటేనే రైతులు వెనుకంజ వేస్తు న్నారు. ఈ ఏడాది రెండు మండ లాల్లో వెయ్యి ఎకరాలలోపే మిర్చిసాగు జరిగే పరిస్థితి. ప్రత్యామ్నాయంగా జామా యిల్, అరటి, మొక్క జొన్న పంటలపై దృష్టి పెడుతున్నారు.

రైతులు తీవ్రంగా నష్టపోయారు



గత రెండేళ్లుగా మిర్చి సాగు చేసే రైతాంగం తీవ్రంగా నష్ట పోయారు. గతేడాది క్వింటా మిర్చి రూ.ఏడు వేలకు పడిపోయింది. క్వింటా మిర్చి కోయడానికి కూలీలకు రూ.ఏడు వేలు చెల్లించాల్సి వచ్చింది. ఎకరానికి రూ.రెండు లక్షలకు పైగానే రైతులకు నష్టం వచ్చింది. దీంతో మిర్చిసాగు చేయాలంటేనే భయపడే పరిస్థితి ఏర్పడింది.

- దుద్దుకూరు శ్రీనివాస్, రైతు, కుక్కునూరు

అప్పుల ఊబిలో..

క్వింటా మిర్చి ధర 2020, 2021, 2022 సంవత్సరాల్లో రూ.15 వేలు నుంచి రూ.23 వేల వరకు పలకడంతో కొంత వరకు లాభార్జించారు. ఈ క్రమంలో అధికశాతం రైతులు మిర్చిసాగు వైపు ఆసక్తి చూపడంతో ఎకరం పొలం కౌలు రూ.20 వేల నుంచి రూ.50 వేల వరకు పెరిగింది. మరోవైపు పెట్టుబడులు పెరిగాయి. పంటపై నల్లి అనే వైరస్ దాడి, అతివృష్టి కారణంగా దిగుబడులు తగ్గాయి. ఒకప్పుడు ఎకరానికి 30 క్వింటాళ్ల దిగుబడి రాగా గత రెండేళ్లుగా 20 క్వింటాళ్లలోపే దిగుబడి వస్తోంది. దీనికి తోడు రెండేళ్లుగా ధర పతనమైంది. క్వింటా మిర్చి రూ.15 వేల నుంచి రూ.ఏడు వేలకు పడిపోయింది. కోత కూలీల ఖర్చు రాని పరిస్థితి నెలకొంది. గతేడాది 90 శాతం రైతులకు ఎకరానికి రూ.రెండు లక్షలకు పైగా నష్ట రావడంతో ఈ ఏడాది మిర్చి సాగుకు అమడదూరంలో ఉన్నారు.

ప్రత్యామ్నాయంగా జామాయిల్, అరటి

మిర్చి సాగుతో నష్టపోతున్న రైతాంగం ప్రత్యామ్నాయ పంటల వైపు చూస్తున్నారు. ఈ ఏడాది 90 శాతం జామాయిల్ సాగు చేస్తున్నారు. జామాయిల్ టన్ను ధర రూ.ఏడు వేల నుంచి రూ.7,500 వరకు పలుకుతోంది. తక్కువ శ్రమ, పెట్టుబడి, నికర లాభం వస్తుందనే ఆలోచనతో ఈ పంటవైపు ఆసక్తి చూపుతున్నారు. అరటి, మొక్కజొన్నపైనా దృష్టి పెట్టారు. చీరవల్లి, మాధవరం, దామరచర్ల, ముత్యాలమ్మ పాడు, తదితర గ్రామాల్లో దాదాపు 200 ఎకరాల్లో అరటిని సాగు చేస్తున్నారు.



జామాయిల్ సాగు



పల్లెల్లో స్వచ్ఛ రథం

» త్వరలో జిల్లాలో ఎంపిక చేసిన రెండు పంచాయతీల్లోనే అమలు

ఏలూరు రూరల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి):వైసీపీ హయాంలో చెత్తపై పన్ను వేస్తే టీడీపీ ప్రభుత్వం పొడి చెత్తకు సరుకులిచ్చే కార్యక్రమానికి చుట్టింది. తడి, పొడి చెత్తలని వేరు చేయడం కష్టంగా మారిన తరుణంలో గ్రామాల్లో శుభ్రతతో పాటు ప్రజలకు ఆదాయమూ సమకూరేలా పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో 'స్వచ్ఛ రథం' కార్యక్రమం చేపట్టింది. త్వరలో జిల్లాలో ప్రయోగాత్మకంగా రెండు పంచాయతీల్లో అమలు చేయనుంది. ప్రస్తుతం చిత్తూరులో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేశారు. ఇది విజయవంతం కావడంతో ఏలూరు జిల్లాలో అమలుకు చర్యలు చేపడుతున్నారు. అయితే ఏ గ్రామాల్లో అమలు చేయాలన్నది నిర్ణయించలేదు. ఈనెల 15వ తేదీ నుంచి అమలు చేయాలని భావించినా పూర్తి కార్యాచరణ సిద్ధం కాకపోవడంతో కాస్తా ఆలస్యం కానుంది.

ఎండీయూ వాహనాల వినియోగం

స్వచ్ఛరథం కోసం మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్ (ఎండీయూ) వాహనాలను వినియోగించుకునేలా చర్యలు చేపట్టారు. సాధారణంగా గ్రామాల్లో కొందరు పాత సామాన్లకు ఉల్లి పాయలు, బెల్లం వంటి వస్తువులను ఇస్తామంటూ ఆటోలు, ద్విచక్ర వాహనాల్లో తిరిగి సేకరిస్తుంటారు. దీన్ని ప్రణాళికాబద్ధంగా ప్రభుత్వమే చేపట్టనుంది. పొడి చెత్త బరువును బట్టి ప్రతిఫలంగా సరుకులు ఇవ్వనున్నారు. ఇందులో భాగంగా స్వచ్ఛ రథం వాహనాలు గ్రామాల్లోకి వెళ్ళి ప్రజల నుంచి రీసైక్లింగ్ వ్యర్థాలను (ప్లాస్టిక్ వ్యర్థాలు, ప్లాస్టిక్ బాటిళ్లు, నీళ్ల బాటిళ్లు, బ్యాగులు, అట్టపెట్టెలు, తదితరాలు) సేకరించి దానికి ప్రత్యామ్నాయంగా నిత్యావసరాలైన వేరుశనగ, కందిపప్పు, కొబ్బరినూనె, సేమియా, ఉల్లిపాయలు, టీపొడి, సబ్బులు, తదితరాలు అందించనున్నారు. ఇంటి వద్దకే వచ్చి ప్రజల నుంచి సేకరించిన ప్లాస్టిక్ వ్యర్థాలను తూకం వేసి ధర నిర్ణయిస్తారు. దాని ప్రకారం నిత్యావసర సరుకులను తీసుకోవచ్చు.

పోలీసుల అదుపులో గంజాయి నిందితులు ?

■ లోపలి పేజీలో..



కార్యక్రమంలో పాల్గొన్న డీఎంహెచ్‌వో, ఆసుపత్రి సూపరింటెండెంట్, తదితరులు

బిడ్డకు ముర్రుపాలే శ్రేష్ఠం : డీఎంహెచ్‌వో

ఏలూరు అర్బన్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ముర్రుపాలుకు మార్కెట్‌లో లభ్యమయ్యే ఏ బేబీ ఫార్ములా ఆహార పదార్థాలు సాటికావని, తల్లి ముర్రుపాలే బిడ్డకు మొదటి టీకా అని డీఎంహెచ్‌వో డాక్టర్ పీ.జే.అమృతం పేర్కొన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను శుక్రవారం స్థానిక ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి మాతాశిశు సంరక్షణ విభాగంలో ఆమె ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ బిడ్డపుట్టిన గంటలో తల్లిపాలు తాగించడం సంపూర్ణ ఆరోగ్యానికి మార్గమన్నారు. ఈ నెల 7వ తేదీవరకు జిల్లాలోని పీహెచ్‌సీలు, గ్రామ/వార్డు సచి వాలయాల్లో తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించేలా ఆదేశాలు జారీ చేశామన్నారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ శోభ, సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.ఎస్.రాజు, గైనకాలజిస్టు డాక్టర్ లావణ్య, పీడియాట్రిస్టు డాక్టర్ దీపక్‌కుమార్, ఆర్ఎంవో మల్లికార్జునరావు, డీపీహెచ్ఎన్‌వో డాక్టర్ జ్యోతి, పీపీ యూనిట్ మెడికల్ ఆఫీసర్ ఆనంద్, డాక్టర్ ప్రసన్నకుమార్, తదితరులు పాల్గొన్నారు.

లెక్క తేలింది

» పెయ్యేరు పంచాయతీలో రూ.37.59 లక్షల నిధుల దుర్వినియోగం

ముదినేపల్లి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): పెయ్యేరు పంచాయతీలో గత మూడేళ్లలో పంచాయతీ నిధులు రూ.37.59 లక్షలు దుర్వినియోగం జరిగినట్టు పంచాయతీ శాఖ అధికారులు లెక్క తేల్చారు. గతంలో నిధుల దుర్వినియోగంపై గ్రామస్థులు కొందరు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడం, హైకోర్టులో విచారణ కోరుతూ రిట్ దాఖలు చేసిన పరిస్థితుల్లో అప్పటి డివిజనల్ పంచాయతీ అధికారి చంద్రశేఖర్ విచారణ జరిపారు. నిధుల వినియోగం, పరిపాలన పరమైన అంశాల్లో పలు అవకతవకలు చోటు చేసుకోవడం, పంచాయతీ ఆదాయాన్ని రికార్డుల్లో నమోదు చేయకపోవడం వంటి అంశాలను నిర్ధారించారు. పంచాయతీ ఆడిట్ రిపోర్టులను పరిశీలించిన అనంతరం అప్పటి డీఎల్‌పీవో ఇచ్చిన విచారణ నివేదిక ఆధారంగా 2021-22 నుంచి 2023-24 వరకు రూ.37.59 లక్ష లు పంచాయతీ నిధులు దుర్వినియోగం జరిగినట్టు ధ్రువీక రిస్తూ డీపీవో అనురాధ ఉత్తర్వులు జారీ చేశారు. ఆ మేరకు అప్పటి పంచాయతీ కార్యదర్శి శ్యామ్ సుందర్‌ను రూ.32.02 లక్షలకు, సర్పంచ్ సుశీలను రూ.5.56 లక్షలకు బాధ్యులను చేస్తూ డీపీవో ఉత్తర్వులు జారీ చేశారని డిప్యూటీ ఎంపీడీవో అశోక్ తెలిపారు.

ఆడిట్ రిపోర్టులపై చర్యలేవి ?

పెయ్యేరు పంచాయతీకి సంబంధించి పరిపాలన అంశాలు, నిధుల వినియోగం, రికార్డుల నిర్వహణలో అవకతవకలకు సంబంధించి ఆడిట్ నివేదికల్లో పంచాయతీ అధికారులు తప్పులు ఉన్నాయని పేర్కొన్నప్పటికీ ఉన్నతాధికారులు ఏ చర్యలు తీసుకోలేదు. 2021 జూలై నుంచి 2023 జూన్ నెలాఖరు వరకు ఏటా పంచాయతీలో జరిగిన అవకతవకలు, ఆర్థిక లావాదేవీల్లో అవకతవకలు చోటు చేసుకున్నాయని అప్పట్లో విచారణాధికారిగా వ్యవహరించిన డీఎల్‌పీవో స్పష్టంగా పేర్కొనగా, అధికారులు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఏటా ఆడిట్ రిపోర్టును పరిశీలించి జరిగిన అవకతవకలపై జిల్లా అధికారులు ఎందుకు చర్యలు తీసుకోలేదన్నది ప్రశ్నార్థకంగా ఉంది.



నిధుల దుర్వినియోగంపై రీ ఎంక్వైరీ

పెయ్యేరు పంచాయతీలో నిధుల దుర్వినియోగం జరిగిందంటూ ఆ గ్రామస్థులు రెడ్డి వెంకటేశ్వరరావు, అల్లా భక్షు, దూబా చంద్రకాంత్ కొత్తగా చేసిన ఫిర్యాదులపై ఈ నెల 4న ఏలూరు ఇన్‌చార్జ్ డీఎల్‌పీవో లక్ష్మి తిరిగి విచారణ జరపనున్నట్టు డిప్యూటీ ఎంపీడీవో అశోక్ తెలిపారు. ఈ విచారణలో 2021-22 నుంచి 2023-24 వరకు పంచాయతీ నిధులు వినియోగం, రికార్డుల నిర్వహణపై పూర్తిస్థాయిలో విచారణ నిర్వహిస్తారని తెలిపారు.

- అశోక్, డిప్యూటీ ఎంపీడీవో

డేంజర్ మలుపులు

ఆదమరిస్తే కాల్వలోకే..

ఇరగవరం (ఆంధ్రజ్యోతి): ఈ దృశ్యాలు చూశారా.. ఏమాత్రం ఆదమరుపుగా ఉన్నా ఏకంగా వంతెనపై నుంచి కాల్వలోకి వెళ్లిపోతాం.. ఇరగ వరం గ్రామంలోని గరిగమ్మల కాలువపై ఉన్న వంతెన రెయిలింగ్ విరిగిపోయి ప్రమాదకరంగా మారింది.ఈ రోడ్డు అర్జునుడు పాలెం, కావలిపురం, రేలంగి తదితర గ్రామ ప్రజలు రాకపోకలతో నిత్యం రద్దీగా ఉంటుంది. దీనికితోడు ఈ వంతెన మలుపులో ఉండడంతో ఎదురెదురుగా వాహనాలు వచ్చిన సమయాల్లో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



ఇరగవరంలో దెబ్బతిన్న వంతెన రెయిలింగ్

మలుపులో ప్రమాదకరంగా వంతెన →



పెంటపాడు-ముదునూరు కేఎస్ రహదారిపై మలుపు..

పెంటపాడు -ముదునూరు రోడ్డులో..

పెంటపాడు (ఆంధ్రజ్యోతి) : తాడేపల్లిగూడెం నుంచి భీమవరం వెళ్లే ప్రధాన రోడ్డులో పెంటపాడు నుంచి ముదునూరు వెళ్లే వద్ద రహదారిపై ప్రమాదకరమైన మలుపులు ఉన్నాయి. ఈ మలుపుల వద్ద జరిగిన ప్రమాదాల్లో చాలామంది మృత్యువాత పడ్డారు. మరెందరో క్షతగాత్రులుగా మిగిలారు. తాడేపల్లిగూడెం నుంచి భీమవరం, అత్తిలి అక్కడి నుంచి, గణపవరం నుంచి పలు గ్రామాలకు ఇదే ప్రధాన రహదారి. దీంతో ఈ రహదారి ఎల్లప్పుడు వాహన దారులతో బిజీగా ఉంటుంది. ప్రమాదకరమైన మలుపుల వద్ద వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. దీంతో పెంటపాడు ఎస్ఐ స్వామి ఆధ్వర్యంలో మలుపుల ప్రాంతంలో ప్రమాదాలను అరికట్టేందుకు స్టాపర్లను ఏర్పాటు చేశారు.



గరగపర్రు వద్ద మలుపులో శిథిలావస్థకు చేరుకున్న వంతెన

ఎస్ టర్నింగ్‌లో శిథిలావస్థలో వంతెన

పాలకోడేరు (ఆంధ్రజ్యోతి): మండలంలోని భీమవరం నుంచి తాడేపల్లిగూడెం వెళ్లే రహదారిలో గరగపర్రు వద్ద 'ఎస్' టర్నింగ్ వద్ద ఉండి పంట కాలువపై నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరుకుంది. భీమవరం నుంచి తాడేపల్లిగూడెం వెళ్ళడానికి ఇదే ప్రధాన మార్గం. ఈ రహదారి వెంబడి నిత్యం వందలాది వాహనాలు ప్రయాణాలు సాగిస్తూ ఉంటాయి. పెద్ద పెద్ద భారీ వాహనాలు ప్రయాణించే సమయంలో ఈ వంతెన మలుపులో ఉండటంతో ఆ వాహనాలు టర్నింగ్ తిరగలేని పరిస్థితి ఉంది. చాలా సందర్భాల్లో ఈ వంతెనపై భారీ వాహనాలు చిక్కుకుని గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోయేది. వంతెనకు ఇరువైపులా ఉండే రెయిలింగ్స్ కూడా పూర్తిగా పాడైపోయాయి. ఎప్పుడు కూలిపోతుందోనని అటు వాహనదారులు బిక్కుబిక్కుమంటూ ప్రయాణాలు సాగిస్తున్నారు.

ఈ మలుపుల్లో జర జాగ్రత్త

ఉండి (ఆంధ్రజ్యోతి): ప్రమాదకర మలుపులతో వాహనదారులు ప్రయాణికులు హడలెత్తుతున్నారు. ఉండి గ్రామంలో పలుచోట్ల వున్న ఈ మలుపులతో ఎప్పుడు ఎటువంటి ప్రమాదం జరుగుతుందోనని భయపడుతున్నారు. ఉండి సెంటర్ నుంచి గణపవరానికి వెళ్లే దారిలో మలుపు ప్రమాదకరంగా మారింది. దీనిపక్కనే పాములపర్రు పంట కాలువ



ఉండి బస్టాండ్ దాటాక భీమవరానికి వెళ్లే రోడ్డులో..



ఉండి పెదవంతెన సెంటర్ నుంచి గణపవరం రోడ్‌లోకి వెళుతుంటే ప్రమాదకర మలుపు

వుంది. ప్రయాణికులు కానీ వాహనదారులు కానీ అదమరిచారంటే సరాసరి పంట కాలువలోకి జారుకుంటారు. ఉండి నుంచి పాములపర్రు వెళ్లే పదెకరాల తూము వద్ద మలుపు, ఉండి బస్టాండ్‌కు సమీపంలో బొండాడ డ్రెయిన్ దాటిన తరువాత అడితి ప్రాంతంలో వున్న మలుపు ప్రమాకరంగా మారింది. ఈ మలుపుల వద్ద తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అధ్వాన రోడ్లు



ఆచంట- మార్టేరు ఆర్అండ్‌బీ రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్

ప్రమాదాలకు నిలయంగా డివైడర్‌లు

ఆచంట (ఆంధ్రజ్యోతి): ఆచంటలోని ఆర్అండ్‌బీ రోడ్డులో ఉన్న డివైడర్‌లు ప్రమాదాలకు నిలయంగా మారాయి. ఎస్‌బీఐ సమీపం వద్ద ఉన్న డివైడర్ అత్యంత ప్రమాదకరంగా మారింది. ఇటీవల అనేక మంది రాత్రి సమయంలో ద్విచక్ర వాహనదారులు ఈ డివైడర్‌ను ఢీకొని ప్రమాదాలు బారినపడ్డారు. వాహనాలు ధ్వంసం అవడంతో పాటు అనేకమంది గాయాలపాలైన వారు ఉన్నారు. డివైడర్‌కు కనీసం ఎటువంటి రంగులు వేయడం గాని, ప్రమాద సూచిక బోర్డు లేకపోవడంతో ముఖ్యంగా రాత్రి సమయాల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి డివైడర్ వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



పెనుగొండలో వంతెన ఎక్కే దారిలో ప్రమాదకర పరిస్థితి..

వంతెన ఎక్కాలంటే భయం..

పెనుగొండ (ఆంధ్రజ్యోతి): కాకిలేరు, కంతేరు గ్రామాల నుంచి పెనుగొండ వైపు వచ్చేందుకు పెనుగొండలో ఉన్న వంతెన పైకి ఎక్కి రావాల్సి ఉంటుంది.వంతెన ఎక్కే సమయంలో దిగే సమయంలో సైడ్ వాల్స్ గాని, ఎటువంటి హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో ప్రమాదాల పాలవుతున్నారు. వంతెనకు మరమ్మతులు చేసి ఇటీవల ప్రారంభోత్సవం కూడా చేశారు. ఇటీవల భార్యభర్తలు మోటారుసైకిల్‌పై వంతెన పైకి ఎక్కే సమయంలో రాత్రి కావడంతో దారి కనపడక వంతెనపై నుంచి కిందకు పడిపోయారు. స్వల్ప గాయాలతో బయట పడ్డారు.వంతెన ఎక్కే సమయలో ఏమాత్రం ఆదమరిచినా ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉందని వెంటనే వంతెన రోడ్డుకు సైడ్ వాల్స్ ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఆంధ్రజ్యోతి ఫోకస్

ఎవరికీ పట్టని పుంతదారులు



మండపాక వరిగేడు -దువ్వ పుంత రోడ్డు

నడిచేందుకు కూడా వీలు లేదు..

తణుకు రూరల్ (ఆంధ్రజ్యోతి): తణుకు రూరల్ మండలం మండపాక గ్రామం నుంచి కొండాయపాలెం, దువ్వ, వెళ్లే పుంత రోడ్డు కనీసం నడవడానికి కూడా వీలులేకుండా ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండపాక గ్రామం నుంచి కొండాయపాలెం రామన్ చెరువు దగ్గర నుంచి వరిగేడు, దువ్వ గ్రామంలోని దానమ్మ గుడికి వెళ్లే రోడ్డు సుమారు 2 కిలోమీటర్ల మేర గోతులు పడి వర్షం వస్తే కనీసం నడవడానికి కూడా వీలు లేకుండా తయారైంది. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డుకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.



పెనుగొండ మండలంలో అధ్వానంగా ఉన్న పుంత రోడ్లు

వానొస్తే రైతులకు అవస్థలే..

పెనుగొండ (ఆంధ్రజ్యోతి): పెనుగొండ మండలంలో సన్న చిన్న మేజర్ పుంతలు కలిపి సుమారు 50 రోడ్లు ఉన్నాయి. వీటి ద్వారా మండలంలోని సుమారు 15 వేల ఎకరాల పంట భూములు ఉత్ప త్తులు తరలించవలసి ఉంటుంది. పెనుగొండ మార్కెట్ యార్డు ద్వారా కొన్నేళ్ళుగా పుంత రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేయడం లేదు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో బురద రోడ్లతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పంట ఉత్పత్తులను ప్రధాన రహదారికి తీసుకువెళ్లేందుకు అదనపు ఖర్చు అవుతోందంటున్నారు.

గోతులమయమైన తీరప్రాంత రోడ్లు

మొగల్తూరు (ఆంధ్రజ్యోతి): తీరంలోని గ్రామాల్లో అంతర్గత రహదారులు అధ్వాన్నంగా మారాయి. పేరుపాలెం, మొగల్తూరు, కాళీపట్నం, శేరేపాలెం గ్రామ పంచాయతీల పరిధిలోని గ్రామీణ రహదారులు గోతులు పడడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సునామీ అనంతరం విపత్తుల సమయంలో ప్రజలు సురక్షితంగా వచ్చేందుకు తీర గ్రామాల్లోని మారుమూల ప్రాంతాలకు సైతం సీసీ రోడ్లు, తారు రోడ్డులు నిర్మించారు. దశాబ్దకాలం దాటడంతో ఆ రహ దారులు గోతులమయమయ్యాయి. గ్రామీణ ప్రజలు, విద్యార్థులు, స్థానిక రైతులు ఈ రహదారులపై ప్రయాణం చేయలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పేరుపాలెం నార్త్ పంచాయతీ పరిధి ఏటిమొండి వెళ్లే రహదారితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వీటిని అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.



అధ్వానంగా ఏటిమొండి రహదారి



భీమవరం బుల్స్ క్రికెట్ టీం లోగో ఆవిష్కరిస్తున్న రఘురామకృష్ణరాజు,రామాంజనేయులు

ఏపీఎల్ భీమవరం బుల్స్ లోగో ఆవిష్కరణ

భీమవరం రూరల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) భీమవరం బుల్స్ లోగోను, జెర్సీ (డ్రెస్ కోడ్)ను భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు ఆవిష్కరించారు. భీమవరం ఖ్యాతి నిలిచేలా క్రీడాకారులు కూడా కష్టపడి ఆడాలని కోరారు. ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల వైస్ ప్రెసిడెంట్ రంగరాజు, ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ అత్యంత ప్రతిష్టాత్మకరమైన భీమవరం బుల్స్ క్రికెట్ టీం లోగో, జెర్సీ లాంచ్ తమ కళాశాలలో ఏర్పాటు చేయడం తమ కళాశాల క్రీడాకారులకు ప్రోత్సాహాన్ని అందించినట్లు ఉంటుందన్నారు. ఏపీఎల్ భీమవరం బుల్స్ టీం కెప్టెన్ నితీష్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఆగస్టు 8 నుంచి 24 వరకు విశాఖపట్నంలో ఏడు టీమ్స్‌తో ఆంధ్ర ప్రీమియర్ లీగ్ క్రికెట్ మ్యాచెస్ జరుగుతాయన్నారు.

ఉమ్మడి జిల్లాలో 203 మందికి కానిస్టేబుల్ ఉద్యోగాలు

ఏలూరు క్రైం/ జీలుగుమిల్లి/ కాళ్ల ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : కానిస్టేబుళ్లకు ఎంపి కైన అభ్యర్థుల్లో ఉమ్మడి జిల్లాకు సంబం ధించి సివిల్ విభాగంలో 203 మంది ఉద్యోగాలు సాధించారు. వీరిలో 67 మంది మహిళలు ఉన్నారు. కృష్ణా, తూర్పు, పశ్చిమ, ఉమ్మడి జిల్లాలు, విజయవాడ సిటీ ఇలా 4 జిల్లాల పరిధిలో ఉన్న రాజమహేంద్రవరం బెటాలియన్‌లో 630 మంది ఏపీ ఎస్పీ కానిస్టేబుళ్ళుగా ఎంపికయ్యారు. జీలుగుమిల్లి మండలం నుంచి ముగ్గురు యువకులు ఎంపికయ్యారు. జీలుగుమిల్లికి చెందిన ఉర్ల రవితేజ,, ములగలంపల్లికి చెందిన అడ్డగర్ల నాగేంద్ర, రాచూరి కల్యాణ్ కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించారు. రవితేజ తండ్రి కేబుల్ ఆపరేటర్‌గా పనిచేస్తుండగా నాగేంద్రది వ్యవసాయ కుంటుంబం. కల్యాణ్ తల్లిదండ్రులు చిన్న హోటల్ నడుపుతున్నారు. కాళ్ళ గ్రామానికి చెందిన పంజా రామకల్కి కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. దీంతో సాధారణ మధ్యతరగతి కుటుంబానికి చెందిన పంజా నాగేశ్వరరావు- నాగేశ్వరి దంపతుల ఆనందానికి అవధుల్లేవు.



రామకల్కి, అరుణ్‌తేజ, నాగేంద్ర, రాచూరి కల్యాణ్,

సరదా కాదు..



పిల్లలకు అది సరదా కావచ్చు.. కానీ ప్రాణాలకే ప్రమాదంగా మారుతుంది.. చాలామంది తల్లిదండ్రులు పిల్లలకు బైక్‌లు ఇచ్చి బయటకు పంపుతున్నారు.. తెలిసీ తెలియని వయసు కాబట్టి బైక్‌లపై దూసుకుపోతుంటారు.. చెప్పినా వినే ఓపికలేని వయసు వారిది.. రోడ్లపై ఇష్టానుసారంగా డ్రైవింగ్ చేస్తూ ప్రమాదాలను సృష్టిస్తున్నారు. వారికే కాదు.. వారివల్ల రోడ్డుపై ప్రయాణించేవారికీ ప్రమాదమే..

తేడా వస్తే ప్రాణాల మీదకు
మైనర్ల బైక్ డ్రైవింగ్‌తో ఇబ్బందులు
తనిఖీలు లేకపోవడంతో ప్రమాదాలు

భీమవరం క్రైం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : పిల్లలంటే తల్లిదండ్రులకు ఎనలేని ప్రేమ ఉంటుంది. కాదనలేం.. కానీ వారు కోరినదల్లా ఇస్తే ముప్పే..స్కూళ్లకు, కాలేజీలకు వెళ్లే పిల్లలకు బైక్‌లు ఇచ్చి పంపుతున్నారు. ఇటీవల కాలంలో ఇలాంటి వైఖరి బాగా పెరిగింది ముఖ్యంగా పిల్లలకు వాహనాలు ఇచ్చేముందు వారు ఎలా వెళతారో..? డ్రైవింగ్ పూర్తిగా నేర్చుకున్నారా ? అనేది ఆలోచించడం లేదు. పైగా తమ పిల్లలు చిన్న వయసులోనే బైక్‌లు నడుపుతున్నారని అందరితో గొప్పలు చెబుతున్నారు. వాహనాలు ఇచ్చే తల్లిదండ్రుల్లో భయం ఉండాలి.. ఇదివరకైతే తల్లిదండ్రులు సైకిల్ కొని ఇచ్చేవారు.. ఇప్పుడలా కాదు.. ఏకంగా బైక్‌లే టార్గెట్ పెడుతున్నారు. ఒత్తిడి చేసి మీన కొనిపించుకుంటున్నారు. డ్రైవింగ్‌పై అవగాహన లేకపోయినా రోడ్లపై దూసుకుపోతూ ఉంటారు. పాఠశాలల యాజమాన్యాలు కూడా పిల్లలు వాహనాలను వేసుకొస్తుంటే ప్రశ్నించడం లేదు..



ప్రమాదాల బారిన పిల్లలు

మైనర్లు వాహనాలు నడిపి ప్రమాదాలను కొనితెచ్చుకుంటున్నారు. వేగంగా వాహనాలు నడపటం వల్ల వారంతట వారే రోడ్డుపై పడిపోవడమో, లేక ఎదురు వస్తున్న వాహనాన్ని ఢీకొట్టి పడిపోవడమో జరుగుతోంది. కొన్ని ప్రమాదాల్లో ప్రాణాలు కూడా పోగొట్టుకున్న సంఘటనలు ఉన్నాయి. పాఠశాలల యాజమాన్యాలు బస్సులు నడుపుతున్నప్పటికీ కొంతమంది బైక్‌లపై వెళ్ళి ప్రమాదాల బారిన పడుతున్నారు. పాఠశాలల యాజమాన్యాలు భారీగా ఫీజులు వసూలు చేస్తుండటమే దీనికి ఒక కారణం కూడా...

పిల్లలపై ముద్దే ప్రాణాల మీదకు తెస్తోంది..

పిల్లలపై ఎక్కువగా గారాబం పెంచుకున్నవారు వారు అడిగిందల్లా ఇవ్వడం చేస్తున్నారు. దీంతో ప్రమాదాల బారినపడుతున్నారు. ద్విచక్ర వాహనాలను చిన్న పిల్లలకు ఇవ్వకూడదు అని పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నప్పటికీ కొందరిలో మార్పు రావడం లేదు. ఏదో విధంగా పిల్లలను వాహనాలపై పంపించి గొప్ప చాటుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. వారికి సరైన డ్రైవింగ్ అవగాహన లేకపోవడంతో ప్రమాదాల బారినపడుతున్నారు. ఇప్పటికైనా తల్లిదండ్రులు పిల్లలకు వాహనాలు ఇవ్వకుండా పాఠశాలలు నిర్ధేశించిన వాహనాల్లో పంపిస్తేనే మంచిది. దాంతోపాటు చాలా మంది యువత షాపింగ్ కోసం సాయంత్రం పూట ద్విచక్ర వాహనాలపై మార్కెట్‌కు వస్తున్నారు. వారికి వాహనం నడపటం కూడా సరిగా రావడం లేదు. తల్లిదండ్రులు ఇలాంటి వాటిపై ఒకసారి ఆలోచించుకోవాలి.



- జయసూర్య, భీమవరం డీఎస్పీ

ఇటీవల జరిగిన కొన్ని ప్రమాదాలు

- భీమవరం పట్టణానికి చెందిన ఒక వ్యక్తికి ఇద్దరు కుమారులు. వారు 8, 9 తరగతులు చదువుతున్నారు. బైక్‌పై పాఠశాలకు వెళతామని మారం చేయడంతో తండ్రి ద్విచక్ర వాహనం కొని ఇచ్చాడు. దీంతో వాహనంపై వెళుతూ కొద్దిరోజుల క్రితం రోడ్డుపై జారి పడ్డారు. అందులో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు ఆటో సహాయంతో ఆసుపత్రికి తరలించారు.
- భీమవరం పట్టణానికి చెందిన ఒక యువకుడు బైక్ కావాలని తల్లిదండ్రులను కోరగా గారాబంతో తండ్రి బైక్ కొని ఇచ్చాడు. ఆ యువకుడు ఒక ప్రముఖ ఇంజనీరింగ్ కళాశాల వద్ద అమ్మాయిల ముందు బైక్‌పై స్పీడ్‌గా వెళ్ళాడు. ఆ బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొనడంతో ఆ యువకుడి తలకు తీవ్ర గాయాలై మరణించాడు. దీంతో ఆ కుటుంబంలో విషాదం అలముకుంది.
- ఆకివీడు పట్టణానికి చెందిన ఒక బాలికకు తండ్రి స్కూటీని కొని ఇచ్చాడు. పూర్తిగా డ్రైవింగ్ రాకపోవడంతో ఆమె కొద్ది కాలం క్రితం ఎదురుగా వస్తున్న వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో ప్రమాదం బారినపడింది. కాళ్ళకు తీవ్ర గాయాలవడంతో ఆసుపత్రిలో చేర్పించారు. అప్పటి నుంచి ద్విచక్ర వాహనం ఇవ్వకుండా బస్సులోనే పాఠశాలకు పంపిస్తున్నాడు.
- కాళ్ళ మండలానికి చెందిన ఇద్దరు యువకులు 9, 10 తరగతులు చదువుతున్నారు. వారు భీమవరం పట్టణంలోని ఒక పాఠశాలకు బస్సులో వెళ్లి వచ్చేవారు. బస్సులో ఎవరో హేళన చేశారని తండ్రికి చెప్పడంతో ద్విచక్ర వాహనం కొని ఇచ్చాడు. ఇద్దరూ రోజూ ద్విచక్ర వాహనంపై పాఠశాలకు వెళ్లి వస్తూ ఉండేవారు. అయితే మార్గమధ్యలో ఒకరోజు ఆటో ఢీకొనడంతో ఇద్దరి తలలకు తీవ్ర గాయాలయ్యాయి. ఆసుపత్రిలో చికిత్స అందించారు.



భీమవరంలో స్కూటీపై వెళుతున్న పిల్లలు



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు

ఆక్వా రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు

కాళ్ల, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి):ఆక్వా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ఏపీ డిప్యూటీ స్పీకర్, ఉండి ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణరాజు తెలిపారు. కాళ్ళ మండలం పెద అమిరంలో ఆక్వా రైతు సంఘ నాయకులు శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. పలువురు ఆక్వా రైతులు తమ సమస్యలను ఆయనకు వివరించారు. ఆయన మాట్లాడుతూ భారత్ ఎగుమతులపై ట్రంప్ విధించిన 25 శాతం పన్నును ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి పీయుష్ గోయల్ తగ్గించేందుకు ప్రయత్నాలు కొనసాగుతాయన్నారు. ప్రధానంగా ఆంధ్రప్రదేశ్‌లో ఇది ఆక్వాకు పెనుభారమేనన్నారు. గడిచిన ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం రైతులకు కొన్ని రాయితీలు కల్పిస్తామని మాట ఇవ్వడం జరిగిందని, వాటన్నింటినీ ఒక్కొక్కటిగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసుకుంటూ వస్తుందన్నారు. ఆక్వా రైతులకు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు విద్యుత్ శాఖ మంత్రితో మాట్లాడి ధర తగ్గేలా చూస్తానని, ప్రభుత్వంతో మాట్లాడి త్వరలో రైతులకు విద్యుత్ సబ్సిడీ ఇచ్చే విధంగా కృషి చేస్తానని రైతులకు హామీ ఇచ్చారు. రొయ్య రైతుల వెల్ఫేర్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు ఎన్.గజపతిరాజు, గౌరవాధ్యక్షుడు వేగేశ్న సత్యనారాయణరాజు, కార్యదర్శి సుబ్బరాజు, భోగిరెడ్డి శ్రీను, మంతెన రూప్‌కుమార్ రాజు, మన్నే శ్రీను, నాని, ఆక్వా రైతులు పాల్గొన్నారు.

5న 'రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం'

ఏలూరు రూరల్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి):ఉద్యోగుల సమస్యలపై ఆగస్టు 5వ తేదీన రాష్ట్రంలో ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక పెన్షనర్లందరితో 'రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం' అనే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్టు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి భూపతిరాజు రవీంద్రరాజు ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు, ఉద్యోగులకు రావలిసిన బకాయిలు, పెండింగ్ డిఏలు, ఐఆర్, పీఆర్‌సి, సరెండర్ లీవులు ఇతర బకాయిలు తదితర అంశాలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ ప్రణాళిక రూపొందించనున్నట్లు తెలిపారు. హక్కులు సాధించుకోవడానికి ఉద్యోగులు ఏకతాటిపైకి వచ్చి ప్రభుత్వంపై ఒత్తిడి చేసి సమస్యలు పరిష్కారానికి ముందుకు రావాలన్నారు.

ప్రైడ్ ఆఫ్ ఇండియా పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు అర్బన్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి):స్వాతంత్ర దినోత్సవం పురస్కరించుకుని తెలుగు రాష్ట్రాల్లో వివిధ రంగాల్లో విశిష్ట సేవలందిస్తోన్న ఉపాధ్యాయులు, వైద్యులు, కళాకారులు, కవులు, రచయితలు, క్రీడాకారుల ప్రతిభను గుర్తించి వారిని ప్రైడ్ ఆఫ్ ఇండియా, ఐకాన్ ఆఫ్ ఇండియా-2025 జాతీయస్థాయి పురస్కారాలతో సత్కరించేందుకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని అర్హుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ (హైదరాబాద్)స్థాపక అధ్యక్షుడు డాక్టర్ నారాయణ మాస్టారు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైనవారికి ఈ నెల 17న హైదరాబాద్‌లో నిర్వహించే కార్యక్రమంలో అవార్డులను అందజేస్తామన్నారు. తమ సేవలను, ప్రతిభను తెలియజేసే సర్టిఫికెట్లు, పత్రికల క్లిప్పింగ్‌ల జిరాక్స్ కాపీలు, 4 పాస్‌పోర్టుసైజు ఫోటోలను దరఖాస్తుకు జతచేసి ఈ నెల 10వ తేదీలోగా ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ, డోర్ నెంబరు 1-20-164, గోకుల్‌నగర్, వెంకటాపురం, తిరుమలగిరి పోస్టు, సికింద్రాబాద్-15 చిరునామాకు పంపాలని సూచించారు. వివరాలకు ఫోన్ నంబరు 96523-47207లో సంప్రదించాలని కోరారు.


స్కేటర్ జెస్సీని అభినందించిన బాలకృష్ణ



దెందులూరు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ఆసియా స్కేటింగ్ పోటీల్లో సిల్వర్ పతకం సాధించి హైదరాబాద్‌లోని ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్న క్రీడాకారిణి మాత్రపు జెస్సీరాజ్‌ను పలువురు అభినందించారు. సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే ఎయిర్‌పోర్టులో జెస్సీని అభినందించారు. అభిమానులు ఆమెకు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు.

రేపు తణుకులో అథ్లెటిక్స్ జిల్లా జట్ల ఎంపిక పోటీలు

తణుకు రూరల్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి):తణుకులో ఈనెల 3వ తేదీన జిల్లా అథ్లెటిక్ జిల్లా జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి సంకు సూర్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తణుకు చిట్టూరి ఇంద్రయ్య మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో జిల్లా జట్ల ఎంపిక పోటీలను ఆదివారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీలు అండర్ 14, 16, 18, 20 విభాగాలలో బాలికలు, బాలురకు విడివిడిగా నిర్వహించి జిల్లా జట్లకు ఎంపిక చేస్తారని తెలిపారు. పోటీలలో ఎంపికైన జట్లు ఈనెల 9 నుంచి 11వ తేదీ వరకూ బాపట్ల జిల్లా చీరాలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. వివరాలకు 99893 63978 నంబరులో సంప్రదించాలని కోరారు.



ఉత్తమ రైతును సత్కరిస్తున్న వెటర్నరీ వర్సిటీ వీసీ, సిబ్బంది

పాడి పరిశ్రమ అభివృద్ధికి ముందుకు రావాలి

తిరుపతి వెటర్నరీ విశ్వ విద్యాలయ ఉపకులపతి

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి):పాడి పరిశ్రమలు స్థాపించేందుకు ఔత్సాహిక యువత ముందుకు రావాలని వేంకటేశ్వర వెటర్నరీ విశ్వ విద్యాలయ ఉపకులపతి డాక్టర్ జె.వెంకటరమణ పిలుపునిచ్చారు. తాడేపల్లిగూడెం మండలం వెంకట్రామన్నగూడెం కృషి విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం ఇండియన్ సొసైటీ ఫర్ యానిమల్ ప్రొడక్షన్ మేనేజ్‌మెంట్ 42వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా పాడిపరిశ్రమ అభివృద్ధిపై ఒక్కరోజు వర్క్ షాపు నిర్వహించారు. ఉపకులపతి మాట్లాడుతూ వెటర్నరీలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉన్నాయని వాటిని అందిపుచ్చుకోవాలన్నారు. డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన వర్సిటీ ఉపకులపతి డాక్టర్ కె.గోపాల్ మాట్లాడుతూ పాడి రైతుల కోసం ప్రభుత్వం అందించే సాయం అందిపుచ్చుకుని యువత పరిశ్రమలు అభివృద్ధి చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ రైతు బోడపూడి రఘుని సత్కరించారు. బఫెలో రీసెర్చ్ స్టేషన్ ఇన్‌చార్జ్, ఆనందరావు, ఉద్యాన విస్తరణా సంచాలకులు గోవిందరాజులు, శాస్త్రవేత్తలు దొరాజీ, వరప్రసాద్, సొసైటీ సెక్రటరీ జనరల్ వెంకట శేషయ్య పాల్గొన్నారు.



డీఎస్పీ ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

మాజీ ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి ఇంటి వద్ద

హై టెన్షన్

- కొల్లేరు వాసుల నిరసన పిలుపుతో పోలీసులు అప్రమత్తం
- రెండు చెక్ పోస్టుల ఏర్పాటు, ముమ్మర తనిఖీలు

దెందులూరు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి):దెందులూరు మండలం కొండలరావుపాలెంలో మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఇంటి వద్ద హైటెన్షన్ నెలకొంది. ఇంటి చుట్టూ పెద్ద ఎత్తున పోలీసులు, ప్రత్యేక బలగాలు భారీగా మోహరించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నారు. వైసీపీ అధికారంలో ఉండగా అబ్బయ్య చౌదరి కొల్లేరు గ్రామస్థులకు లీజు చెల్లించకుండా ఇబ్బందులు పెట్టారని, తమకు రావాల్సిన బాకీ సొమ్ము చెల్లించాలని తాము శాంతియుతంగా నిరసన చేపడుతున్నామని, తమకు మద్దతు ఇవ్వాలని కొల్లేరు సంఘం నాయకుల అభ్యర్థించారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో నూజివీడు డీఎస్పీ, సీఐతో పోలీసులు నిఘా ఏర్పాటు చేశారు. అబ్బయ్య చౌదరి విదేశాల నుంచి తిరిగి రావడంతో ఆ ఇంటి వద్ద ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా గ్రామంలోకి బయట వ్యక్తులను రానివ్వకుండా వాహనాలను తనిఖీ చేశారు. మోటార్ సైకిళ్లను సైతం తనిఖీ చేసిన తర్వాతనే వారిని అనుమతించారు. దీంతో కొండల రావుపాలెంలో హైటెన్షన్ వాతావరణం నెలకొంది. దెందులూరు నియోజక వర్గంలో గత టీడీపీ ప్రభుత్వం బీసీ వర్గీయులకు కేటాయించిన పని ముట్లను వారికి ఇవ్వకుండా అబ్బయ్య చౌదరి అమ్ముకున్నారని, వెంటనే బీసీల వర్గీయులకు పనిముట్లను అందించాలని వారు కూడా వచ్చే అవకాశం ఉండటంతో పెదవేగి సీఐ, ఎస్ఐ, ప్రత్యేక పోలీసు బలగాలు మొహరించి మాజీ ఎమ్మెల్యే ఇంటి వద్ద బందోబస్తు నిర్వహిస్తున్నారు. డీఎస్పీ శ్రావణ్‌కుమార్, సీఐ రాజశేఖర్, ఎస్ఐల ఆధ్వర్యంలో చెక్ పోస్టులతో తనిఖీ చేస్తున్నారు. కాగా కొల్లేరులంక గ్రామస్థులు కొండలరావు పాలెం రాకపోవడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

వృత్తి సామర్థ్యమే..

కొలమానం!

గురు పూజోత్సవం సందర్భంగా ఉత్తమ సేవలందించిన ఉపాధ్యాయులకు ప్రభుత్వం అందజేసే అవార్డులను ఎంపిక చేసేందుకు విద్యాశాఖ మార్గదర్శకాలను శుక్రవారం విడుదల చేసింది. విద్య, విద్యాయేతర కార్యక్రమాల్లో అత్యుత్తమ పనితీరు కనబరిచిన వారికే పురస్కారాలు దక్కేలా చర్యలు తీసుకుంది. అవార్డుల ఎంపికకు తాజా మార్గదర్శకాలపై ఉపాధ్యాయ వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది.

- ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి మార్గదర్శకాలు
- గంపగుత్తగా అవార్డుల విధానానికి విద్యాశాఖ చెక్
- జిల్లా, మండల స్థాయి అవార్డులకూ పరిమితులు
- శుభ పరిణామమన్న ఉపాధ్యాయ వర్గాలు

ఏలూరు అర్బన్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి):పెర్ఫార్మెన్స్ ఆధారిత అవార్డులకు అర్హుల ఎంపికకు లీప్ యాప్ వినియోగాన్ని రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు ప్రామాణికంగా తీసుకోనున్నారు. అన్ని ప్రభుత్వ యాజమాన్యాలకు చెందిన పాఠశాలలు, సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూళ్లలో పనిచేసే టీచర్లు, టీజీటీలు, పీజీటీలు, డైట్ కేంద్రాల్లో పనిచేసే సీనియర్ లెక్చరర్ల నుంచి 14 కేటగిరీల్లో మొత్తం 104 మందికి రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులివ్వాలని నిర్ణయించింది. తొలిసారిగా అన్ని అర్హతలుండి, అవార్డులకు దరఖాస్తు చేసుకోని వారిని గుర్తించి వారి పెర్ఫార్మెన్స్, అచీవ్‌మెంట్స్ తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని, ఈ కేటగిరీలో ఐదుగురిని ఎంపికచేసి ఫెలో టీచర్ అవార్డులు ఇవ్వాలని నిర్ణయించారు. నిర్దేశిత మార్గదర్శకాల మేరకు అర్హతలున్న వారి నుంచి ఈ నెల 8లోగా ఆన్‌లైన్/ఆఫ్‌లైన్ విధానంలో దరఖాస్తులను స్వీకరించి, వివిధ దశల్లో పరిశీలన, వడపోత, ఇంటర్వ్యూ ప్రక్రియల అనంతరం ఈ నెల 25న రాష్ట్రస్థాయి కమిటీ షార్ట్‌లిస్టును ఖరారు చేస్తుంది. సెప్టెంబరు 5న నిర్వహించే రాష్ట్ర వేడుకలో పురస్కారాలను అందజేస్తారు. రాష్ట్రస్థాయి పురస్కారం కింద బంగారుపూత పూసిన సిల్వర్ మెడల్, శాలువా, రూ.20 వేలు నగదు బహుమతి, మెరిట్ సర్టిఫికెట్‌ను అందజేస్తారు.

జిల్లా, మండల స్థాయిల్లోనూ పరిమితులు

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు జిల్లా, మండల స్థాయిల్లో ఇంతవరకు పరిమితులు లేవు. ఉత్తమ పనితీరు కనబరిచిన టీచర్లతోపాటు, స్థానిక పరిస్థితులు, డిమాండ్లు, రాజకీయ/ప్రజాప్రతినిధుల సిఫారసులతో కూడా అవార్డులిచ్చిన సందర్భాలు లేకపోలేదు. కొన్ని సందర్భాల్లో 100-150 వరకు గంపగుత్తగా పురస్కారాలిచ్చిన సందర్భాలున్నాయి. అవార్డులందుకున్న కొందరు టీచర్లపైన ఆరోపణలు, విమర్శలు కూడా కోకొల్లలు. ఇక మీదట ఈ పద్ధతిని సంస్కరిస్తూ ఉత్తమ టీచర్ల పేరిట అవార్డులిచ్చే విధానానికి ప్రభుత్వం తాజా ఉత్తర్వులతో చెక్‌పెట్టింది. ఆ ప్రకారం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులన్నీ కలిపి 30కి మించరాదని స్పష్టం చేసింది. వీటిని ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్, హెచ్ఎం కేటగిరీల నుంచి 10 చొప్పున జిల్లా స్థాయి సెలక్షన్ కమిటీ నిర్ణయించిన వారికే ఇవ్వాలని ఆదేశించింది. ఇక డివిజన్/మండల/మున్సిపల్ పరిధిలో ఇచ్చే అవార్డులను మండలం/మున్సిపాల్టీ నుంచి 10 మంది ఎస్జీటీలు, ఐదుగురు స్కూల్ అసిస్టెంట్ కేడర్ ఉపాధ్యాయులను ఎంపిక చేయాలని ఆదేశించింది.

8 లోగా స్టేట్ దరఖాస్తు చేసుకోండి : డీఈవో

సెప్టెంబరు 5న నిర్వహించే ఉపాధ్యాయ పురస్కారాల వేడుకలో రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఈ నెల 8వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని డీఈవో వెంకట లక్ష్మమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. కనీసం పదేళ్ల సర్వీసు పూర్తిచేసిన టీచర్లు/హెచ్ఎంలు/టీచర్ ఎడ్యుకేటర్లు అర్హులని, గడువులోగా అవార్డుకు ప్రతిపాదలు సంబంధిత డీవైఈవో/ ఎంఈవో ద్వారా ఏలూరు డీఈవో కార్యాలయానికి పంపాలని కోరారు.

వక్తృత్వ, క్విజ్ పోటీల్లో గోయెంకా కళాశాల విద్యార్థుల ప్రతిభ

పెంటపాడు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా స్థాయిలో జరిగిన వక్తృత్వ, క్విజ్ పోటీల్లో పెంటపాడు డీఆర్ గోయెంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనపర్చారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.వెంకటేశ్వరరావు తెలిపారు. ఇటీవల ఏలూరులో నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో, క్విజ్ పోటీలో తమ విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. అధ్యాపకులు, సిబ్బంది విజేతలను అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల సిబ్బంది



భీమవరంలో పెట్రోల్ బంకును ప్రారంభిస్తున్న జైళ్ల శాఖ డీజీ

ఖైదీల ఉపాధికి జైళ్ల శాఖ తోడ్పాటు

భీమవరం క్రైం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి):రిమాండ్ ఖైదీలకు ఉపాధి నిమిత్తం జైళ్ళ శాఖ ఎంతో కృషి చేస్తుందని, వారు ఈ అవకాశాన్ని సద్వినియోగపరచుకుని ముందుకు వెళ్ళాలని జైళ్ళ శాఖ డైరెక్టర్ జనరల్ అంజనీకుమార్ అన్నారు. శుక్రవారం భీమవరం సబ్ జైల్ వద్ద ఏర్పాటు చేసిన పెట్రోల్ బంకును, అలాగే జైల్‌లో కొత్త భవనాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. జైళ్ల మరమ్మతులు, కొత్త భవనాల కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని తెలిపారు. ఆయనతోపాటు జైళ్ల శాఖ డీఐజీ డాక్టర్ వరప్రసాద్, ఎస్పీ అస్మి, ఏఎస్పీ వి.భీమారావు, భీమవరం డీఎస్పీ ఆర్‌జీ జయసూర్య, వన్‌టౌన్ సీఐ నాగరాజు, జైలు సూపరింటెండెంట్ డి.వెంకటగిరి తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక వసతులతో జైళ్ల నిర్మాణం

కైకలూరు: జైళ్ల నిర్మాణంలో ఆధునిక వసతులను కల్పిస్తున్నట్టు జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ అంజనీకుమార్ అన్నారు. శుక్రవారం కైకలూరు సబ్ జైల్‌లో రూ. 2.11 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న నూతన సబ్ జైల్ పనులను పరిశీలించారు. నిర్మాణ పనుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. నాణ్యతా ప్రమాణాలను పాటించాలన్నారు. ఇక నుంచి స్త్రీ, పురుషులకు వేర్వేరుగా జైళ్ల నిర్మాణం జరుగుతుందన్నారు. జైళ్లశాఖ ఇన్‌చార్జి అధికారి ఉమామహేశ్వరరావు, మచిలీపట్నం జిల్లా జైలుశాఖ సూపరింటెండెంట్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

5న పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

కలిదిండి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి):కలిదిండి పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 5న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ ప్రసాద్ తెలిపారు. ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ విభాగాల కోర్సుల భర్తీకి అడ్మిషన్లు నిర్వహిస్తున్నామన్నారు. టెన్త్ పాసైన విద్యార్థులు, పాలిటెక్నిక్ ఎంట్రన్స్ రాసిన వారు, రాయనివారు కూడా అర్హులని తెలిపారు. ఫీజు తదితర వివరాలకు 90102 22192, 99516 69810 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

లైన్‌మన్‌పై విచారణ వాయిదా

ఉండి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి):ఆక్వా రైతుల చెల్లించే విద్యుత్ బిల్లులు తను సొంతంగా వాడుకున్న విద్యుత్ లైన్‌మెన్‌పై జరుగుతున్న విచారణ సోమవారానికి వాయిదా వేసినట్లు ఉండి విద్యుత్ ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. లైన్‌మన్ దాసరి రాజుపై పలు ఆరోపణల నేపథ్యంలో విద్యుత్ అధికారులు రెండు కేటగిరీలుగా ఏర్పడి విచారణను ప్రారంభించారు. విద్యుత్ బిల్లులకు సంబంధించి ఎవరెవరు లైన్‌మన్‌కు ఎంతెంత ఇచ్చారో విచారించారు. సోమవారం మిగిలిన రైతులను విచారిస్తామని తెలిపారు.

గ్రంథాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా రాంబాబు

ఏలూరు టూటౌన్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా జి. రాంబాబు, ఎండీ జుల్ఫీకర్ అలీలు ఎన్నికయ్యారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో శుక్రవారం ఎన్నిక నిర్వహించారు. అసోసియేట్ అధ్యక్షుడు పి.రంగారావు, ఉపాధ్యక్షుడిగా ఎస్.వెంకటేశ్వరరావు, ఎస్‌డీ లతీఫ్, సహాయ కార్యదర్శిగా కె. వెంకటేశులు, కోశాధికారిగా రామకృష్ణ, కార్యవర్గ సభ్యులుగా ఎం.శోభ, జి.అనిత, బంగారుపాప, ఎన్నికయ్యారు. నూతన కమిటీని గ్రంథాలయాల సంస్థ కార్యదర్శి శేఖర్‌బాబు, ఏపీ జేఏసీ రాష్ట్ర డిప్యూటీ సెక్రటరీ జనరల్ ఆర్ఎస్ హరినాథ్, ఏపీఎన్‌జీవో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు అభినందించారు. జి.శ్రీధర్‌రాజు, నారాయణరావు, ఎల్.వెంకటేశ్వరరావు, సందీప్‌కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం సమాచారం

ఆటో బోల్తాపడి యువకుడి మృతి

ఏలూరు క్రైం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి):అతివేగంగా వెళ్తున్న ఒక ఆటో తిరగబడడంతో అందులో ప్రయాణిస్తున్న ఒక యువకుడు మృతి చెందాడు. ఏలూరు కొత్తపేటలోని కంకణాల వారివీధికి చెందిన అడపా వంశీ (25) పదహారో నంబరు హైవే కలపర్రు టోల్‌గేటు సమీపంలో ఒక హోటల్‌లో పనిచేస్తున్నాడు. గతనెల 31వ తేదీ రాత్రి హోటల్‌లో పని ముగించుకున్న తరువాత ఏలూరులోని తన ఇంటికి రావడానికి ఒక ఆటో ఎక్కాడు. ఆటో డ్రైవర్ అతివేగంగా ఆటోను నడపడంతో టోల్‌గేటు సమీపంలో బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలకు గురైన వంశీని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకురాగా ఆసుపత్రి వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. ఈ ఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృత దేహానికి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

యువకుడి అనుమానాస్పద మృతి



చందు మృతదేహం

మండవల్లి, ఆగస్టు1(ఆంధ్రజ్యోతి): భైరవపట్నం గ్రామానికి చెందిన యువకుడు చెరువులో పడి మృతి చెందిన ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల ప్రకారం భైరవపట్నం గ్రామానికి చెందిన పండు జోజి పెద్దకుమారుడు తరుణ్ అలియాస్ చందు(23) జూలై 31వ తేదీ మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. మరుసటిరోజు ఉదయం వారి ఇంటి పక్కన ఉన్న చేపలచెరువులో చనిపోయి ఉండటాన్ని గమనించారు. అతను ప్రమాదవశాత్తు చెరువులో జారిపడి మృతి ఉండవచ్చని కుటుంబ సభ్యులు తెలిపారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని చేరుకుని మృతదేహాన్ని కైకలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి, అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

డబ్బులు ఇచ్చేందుకు వెళ్తూ యువతి దుర్మరణం

ఏలూరు క్రైం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి):ఆటో డ్రైవర్‌కు కిరాయి డబ్బులు ఇవ్వడానికి వెళ్లగా అతడు స్టాండ్ వద్ద కనిపించలేదు. ఆ సొమ్ములను డ్రైవర్ తల్లికి ఇవ్వడానికి వెళుతూ రైలు పట్టాలుదాటే సమయంలో రైలు ఢీకొనడంతో ఒక యువతి అక్కడికక్కడే మృతి చెందింది. దెందులూరు మండలం సీతంపేటకు చెందిన గాజులశెట్టి యామినీ పూజిత(20) ఏలూరు రామచంద్ర ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతుంది. గ్రామంలో రైల్వేస్టేషన్ దగ్గర ఉండే ఆటో డ్రైవర్ పాలపర్తి దుర్గారావుకు ఆటో కిరాయి రూ.200ను ఆమె ఇవ్వాల్సి ఉంది. ఆ సొమ్ములు ఇవ్వడానికి గతనెల 31వ తేదీ రాత్రి రైల్వేస్టేషన్ వద్ద ఆటో స్టాండ్‌కు వెళ్లగా దుర్గారావు కనిపించలేదు. ఆ సొమ్ములను అతడి తల్లి పాలపర్తి పార్వతికి అందించే నిమిత్తం నడుచుకుంటూ ఫోన్ మాట్లాడుతూ రైలు పట్టాలుదాటుతుండగా రైలు రావడాన్ని గమనించలేదు. రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. శుక్రవారం ఉదయం పూజిత మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి రైల్వే పోలీసులు తరలించి పోస్టుమార్టం జరిపి బంధువులకు అప్పగించారు. యువతి పుట్టిన రోజు ఈనెల 14వ తేదీ కావడంతో ఘనంగా జరుపుకోవాలని ఆశించిన ఆ కుటుంబం తీవ్ర విషాదానికి గురయింది.

వెయ్యి లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

కుక్కునూరు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి):కుక్కునూరు మండల పరిధిలోని సీతారామ్‌నగరం శివారు ప్రాంతంలో గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న సారా తయారీ కేంద్రంపై శుక్రవారం పోలీసులు, ఎక్సైజ్ శాఖ సంయుక్తదాడులు నిర్వహించారు. ఈ దాడిలో సుమారు వెయ్యి బెల్లపు ఊట ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ అక్రమమద్యం తయారీదారులపై కఠిన చర్యలు తప్పవన్నారు. కుక్కునూరు సీఐ రమేశ్‌బాబు, ఎక్సైజ్ సీఐ శ్రీనుబాబు, ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ భోగీశ్వర్‌శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.

శక్తి టీమ్‌తో సత్ఫలితాలు

- పాఠశాలలు, కాలేజీల వద్ద పెంచిన నిఘా
- విద్యార్థిని సమాచారంతో అనుమానాస్పద వ్యక్తిపై బైండోవర్ కేసు



విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్న శక్తిటీమ్ పోలీసులు

ఏలూరు క్రైం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా శక్తి టీమ్‌లు ప్రజలకు, మహిళలకు పలు కళాశాలలు, పాఠశాలల్లో విద్యార్థినులకు అవగాహన సదస్సులు విరివిగా నిర్వహిస్తున్నారు. శక్తిటీమ్‌లు పగటి వేళ కాలేజీలు, స్కూళ్లు ప్రారంభించే సమయం, విడిచిపెట్టే సమయంలో, పాఠశాలలు, కళాశాలల వద్ద నిఘా ఉంటూ ఆకతాయిల భరతం పడుతున్నారు. ఇక అవగాహన సదస్సులు నిర్వహిస్తూ మహిళలకు, విద్యార్థినులకు మేము ఉన్నామంటూ భరోసా కల్పించడంతో సత్ఫలితాలు వస్తున్నాయి. వారి కష్టసుఖాలను, వారి ఎదుట జరిగే అసాంఘిక కార్యకలాపాలు, అసభ్య సంఘటన సమాచారాన్ని నేరుగా శక్తిటీమ్‌కు అందిస్తున్నారు. ఇలాంటి ఘటనే శుక్రవారం ఏలూరు వన్‌టౌన్‌లోని శ్రీకృష్ణదేవరాయ జూనియర్ కాలేజీ, స్కూలులో జరిగింది. ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ పర్యవేక్షణలో మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం.సుబ్బారావు ఆధ్వర్యంలో ఏలూరు వన్‌టౌన్‌లోని శ్రీ కృష్ణ దేవరాయ జూనియర్ కాలేజీ, స్కూలులో విద్యార్థినులకు శుక్రవారం శక్తిటీమ్ అవగాహన సదస్సు నిర్వహించారు. గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తుల వద్దకు వెళ్లకూడదని తెలిపారు. అయితే ఒక విద్యార్థిని వెంటనే శక్తిటీమ్‌కు ఒక సమాచారాన్ని అందించింది. తమ ప్రాంతంలో 50 ఏళ్ల వయస్సు ఉన్న వ్యక్తి బాలికలను పిలిచి అతని ఫోన్‌లో ఏవో చూపి స్తున్నాడని తనకు అనుమానంగా ఉందని ఆ బాలిక సమాచారం ఇచ్చింది. వెంటనే శక్తిటీమ్ రంగంలోకి దిగింది. యథావిధిగా శుక్రవారం సాయంత్రం స్కూలు నుంచి ఇళ్లకు వెళ్లే బాలికలను గమనించి, అనుమానాస్పదంగా తిరుగుతున్న అతడిని అదుపులోకి తీసుకుని బైండోవర్ కేసు నమోదు చేశారు. ఏలూరు మండల తహసీల్దార్ ముందు హాజరు పరిచారు. నగరంలో కళాశాలలు, పాఠశాలల వద్ద గాని ఏ ప్రాంతంలోనైనా బాలికలతో మాట్లాడినట్లు ఉంటే అతడిపై కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హెచ్చరిం చి పూచీకత్తుతో విడుదల చేశారు. ఎక్కడైనా ఆకతాయిలు కనిపిస్తే వెంటనే 112కు సమాచా రం ఇవ్వాలని, లేదా శక్తిటీమ్ సభ్యులకు నేరుగా చెప్పాలని సీఐ సుబ్బారావు సూచించారు. సమాచారమిచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని అధైర్యపడకుండా శక్తి టీమ్‌కు సమాచారం ఇవ్వాలని విద్యార్థినులకు సీఐ సూచించారు.

పోలీసుల అదుపులో గంజాయి నిందితులు ?

ఏలూరు క్రైం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి):ఏలూరు టూ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ముగ్గురు యువకులు గంజాయిని విక్రయిస్తున్నట్లు సమాచారం ఉండడంతో పోలీసులు కొద్ది రోజులుగా నిఘా పెట్టి వారిని అదుపులోకి తీసుకు న్నారు. అయితే పూర్తిస్థాయిలో విచారణ చేపట్టారు. వారు ఆ గంజాయిని ఎక్కడ నుంచి ఎలా తీసుకువచ్చారు? వారికి ఎవరు విక్రయించారు ? ఇక్కడ ఎవరికి విక్రయిస్తున్నారు ? కొనుగోలు చేసేది ఎవరు ? అనే కోణంలో తమదైన శైలిలో పోలీసులు విచారణ చేస్తున్నట్లు తెలుస్తుంది. మొత్తం మీద ఈ ముగ్గురిని శనివారం అరెస్టు చేసే అవకాశాలు ఉన్నాయి. వారి నుంచి కొంత గంజాయి స్వాధీనం అయినప్పటికీ మిగిలిన గంజాయి ఎక్కడ ఎవరి దగ్గర ఉంది. వారితో ఎవరికి సంబంధాలు ఉన్నాయి అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

మంత్రిపై అసభ్య పోస్టు పెట్టిన వ్యక్తిపై కేసు

చాట్రాయి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి):నూజివీడు ఎమ్మెల్యే, గృహనిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథిపై ఫేస్‌బుక్‌లో అసభ్య పోస్టు పెట్టిన మండలంలో పోలవరం గ్రామానికి చెందిన వడాలి శ్రీనివాసరాజుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ డి.రామకృష్ణ తెలిపారు. పోతనపల్లి టీడీపీ నాయకులు ఫిర్యాదు చేశారన్నారు. సోషల్ మీడియాలో అసభ్యకర, విద్వేషాలు రెచ్చగొట్టే పోస్టులు పెట్టే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

టీడీపీ నాయకుడి ఫోన్ హ్యాక్

చాట్రాయి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): టీడీపీ చాట్రాయి మండల ప్రధాన కార్యదర్శి తేళ్ళూరి శేఖర్ ఫోన్‌ను సైబర్ నేరగాళ్ళు హ్యాక్ చేశారు. ఆయన వాట్సాప్ నంబర్ నుంచి శుక్రవారం ఎస్‌బీఐ రివార్డ్సు పేరుతో లింకులను టీడీపీ గ్రూపుల్లో పోస్టు చేశారు. వెంటనే అప్రత్తమైన శేఖర్ తన వాట్సాప్ అకౌంట్‌ను డిలీట్ చేశారు. ఈ లింకులు ఎవరూ ఓపెన్ చెయ్యవద్దని, లింక్ ఓపెన్ చేస్తే బ్యాంకులో ఉన్న డబ్బులు పోతాయని ఓ వ్యక్తి పోస్టు పెట్టారు. ఈ విషయమై శేఖర్‌ను వివరణ కోరగా తాను కొన్ని రోజుల క్రితం పాన్ కార్డు కోసం ఆన్‌లైన్ లింక్‌లో వివరాలు నమోదు చేసి ఓటీపీ అడిగే సరికి వెనక్కి వచ్చానని అప్పుడే ఫోన్ హ్యాక్ అయ్యి ఉంటుందని అనుకుంటున్నాని, తన అకౌంట్ నుంచి డబ్బులు పోలేదన్నారు. దీనిపై పోలీసుల ఫిర్యాదు చేస్తానని, ఎవరూ సామాజిక మాధ్యమాలలో వచ్చే లింకులను ఓపెన్ చెయ్య వద్దని శేఖర్ కోరారు.

యూనియన్ బ్యాంకులో అగ్నిప్రమాదం



మంటలను అదుపు చేస్తున్న సిబ్బంది

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం రైల్వేస్టేషన్ సమీపంలోని యూనియన్ బ్యాంకులో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో శుక్రవారం తెల్లవారు జామున అగ్ని ప్రమాదం జరిగింది. ఫైర్ అలారం మోగడంతో స్థానికులు అప్రమత్తమై అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సత్వరమే అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపుచేశారు. మంటలు రికార్డ్‌ల రూంలోకి వ్యాపించకపోవడంతో బ్యాంకు అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. రూ.40వేలు ఆస్తినష్టం వాటిల్లినట్టు అగ్నిమాపక అధికారి ఎం.కొండబాబు తెలిపారు.

పెట్రోల్ కల్తీ జరిగిందని వాహనదారుడి ఆందోళన

తణుకు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి):తణుకు పట్టణంలోని రాష్ట్రపతి రోడ్డులో ఉన్న ఓ పెట్రోల్ బంకులో పెట్రోల్ కల్తీ జరిగిందని వాహనదారుడు ఆందోళనకు దిగాడు. శుక్రవారం సాయంత్రం తణుకు పట్టణానికి చెందిన శంకర్ అనే వ్యక్తి తన వాహనానికి బంకులో పెట్రోల్ కొట్టించుకున్నాడు. తర్వాత కొద్ది దూరం వెళ్లే సరికి బైక్ ఆగిపోయింది. పెట్రోల్ ఉన్నప్పటికి బైక్ ఆగిపోవడం ఏమిటని సమీపంలో ఉన్న మెకానిక్ చూపించాడు. బైక్ కండీషన్ బాగానే ఉందని చెప్పడంతో పెట్రోల్‌లో కల్తీ జరిగిందనే అనుమానంతో తిరిగి బైక్‌తో బంకు దగ్గరకు రావడం, నిర్వాహకులతో బైక్ మరమ్మతులు చేయాలని వాగ్వాదంతో పలువురు అక్కడకు చేరారు. ఈమేరకు నిజాలు తేల్చాలని రెవెన్యూ డీటీ శ్రీదేవి, వీఆర్వో సుధాకర్ విచ్చేశారు. సీఎస్ ఏఎస్వో సూచనలు మేరకు బంకులోని ట్యాంకర్ల నుంచి నమూనాలు సేకరించి తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో కల్తీ లేదని అధికారులు గుర్తించారు. అయినప్పటికి ఆందోళన చేస్తుండడంతో పోలీసులు వచ్చి చక్కదిద్దారు. అనంతరం ఎవరి దారిన వారు వెళ్లిపోయారు.

ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయం : కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరుటూటౌన్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా అధికారులు పని చేయాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆర్ఆర్.పేట, గుబ్బలవారి వీధిల్లో పర్యటించి ప్రజలను డ్రెయిన్ల నిర్వహణ, తాగునీటి సదుపాయం తదితర వాటిపై ప్రజలను అడిగి తెలుసుకుని, సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ భానుప్రతాప్, తహసీల్దార్ గాయిత్రి, టీడీపీ నేతలు నాయుడు సోము, ఈతకోట శ్రీనివాసరావు, ఎస్.దుర్గాప్రసాద్, పాల్గొన్నారు.

ఐదో రోజుకు చేరిన సంతకాల సేకరణ

చింతలపూడి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ ప్రజావేదిక ఆధ్వర్యంలో జరుగుతున్న సంతకాల సేకరణ శుక్రవారం ఐదో రోజుకు చేరింది. నగర పంచాయతీలోని పాత చింతలపూడిలో ఇంటింటికీ వెళ్లి సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా వామపక్ష నాయకులు అక్కడి ప్రజలతో మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల బిగింపును వినియోగదారులు వ్యతిరేకించాలన్నారు. ఈనెల ఐదో తేదీన విద్యుత్ కార్యాలయం వద్ద ధర్నా చేపడుతున్నట్టు వివరించారు. ఆర్.వి.సత్యనారాయణ, టి.బాబు, డి.సత్యనారాయణ, కంచర్ల గురవయ్య పాల్గొన్నారు.

కేంద్రం చర్యలతో పెరిగిన ఎంబీబీఎస్ సీట్లు : ఎంపీ



ఏలూరుటూటౌన్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలతో దేశవ్యాప్తంగా ఎంబీబీఎస్ సీట్లు పెరిగాయని ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ తెలిపారు. పార్లమెంట్‌లో మహేశ్ అడిగిన ప్రశ్నలకు కేంద్రమంత్రి అనుప్రియా పటేల్ సమాధానం ఇచ్చారు. గత ఐదేళ్లలో దేశ్యాప్తంగా 39శాతం సీట్లు పెరిగాయన్నారు. 2020లో 83,275 ఎంబీబీఎస్ సీట్లు ఉండగా 2025 నాటికి 1,15,900 సీట్లు పెరిగాయన్నారు. కేంద్ర ప్రయోచిత పథకం ద్వారా 157 కొత్త వైద్య కళాశాలలు కేంద్రం ఆమోదించిందన్నారు. వీటిలో ఇప్పటికే 131 కళాశాలలు ప్రారంభమయ్యాయన్నారు. పీఎంఎస్ఎస్‌వై పథకం క్రింద 75 సూపర్ స్పెషాలిటీ ప్రాజెక్టులు కేంద్రం ఆమోదించిందన్నారు. వాటిలో 71 ప్రాజెక్టులు పూర్తయ్యాయని, కొత్తగా ఏర్పాటు చేస్తున్న 22 ఏమ్స్ కళాశాలల్లో ఇప్పటికే 19 కళాశాలల్లో యూజీ కోర్సులు ప్రారంభమయ్యాయన్నారు.

నెక్లస్ బండ్, కడమ్మ స్లూయిజ్ సమస్యలు పరిష్కరించాలి



బొరగంకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

పోలవరం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): : పోలవరం మండలంలో పలు మేజర్ సమస్యలపై కూటమి నేతలు శుక్రవారం ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులుకి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జనసేన సీనియర్ నేత కొణతాల ప్రసాద్ మాట్లాడుతూ కడమ్మ స్లూయిజ్ వద్ద ప్రతి వర్షాల సీజన్‌లో వరద నీరు నిలిచి సుమారు నాలుగు వేల ఎకరాల పంటలు నీటమునిగి రైతులు నష్టపోతున్నారని ఆ ప్రాంతంలో భారీ ఎత్తిపోతల పథకం నిర్మించాలన్నారు. పోలవరం గ్రామానికి రక్షణగా వేసిన నెక్లెస్ బండ్‌కి అధికారులు సగం మేర మాత్రమే రాళ్లతో రక్షణ చర్యలు చేశారని పూర్తి స్థాయిలో నెక్లెస్ బండ్‌కి రక్షణ చర్యలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయాలను సీఎం దృష్టికి తీసుకువెళ్లి చర్యలు తీసుకునేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కూటమి నేతలు గునపర్తి చిన్ని, మంగిన కొండ, యడ్ల వినోద్, పిల్లి నాగరాజు, నల్లా రాంబాబు, పోతుల శ్రీను, మజ్జి అప్పారావు పాల్గొన్నారు.

● పోలవరంలో స్థానిక సాంఘిక సంక్షేమ బాలుర, బాలికల వసతి గృహాల్లో మరుగుదొడ్ల నిర్మాణానికి ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు శుక్రవారం పూజలు నిర్వహించి ప్రారంభోత్సవం చేశారు.



ఖాజావలి దంపతులను సత్కరిస్తున్న ప్రతినిధులు

సమాజాభివృద్ధిలో కళాకారులది సుస్థిర స్థానం

ఏలూరు రూరల్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): సమాజాభివృద్ధిలో కళాకారులది సుస్థిరస్థానం అని ఆంధ్రప్రదేశ్ నాటక పరిషత్తుల సమాఖ్య అధ్యక్షుడు ముద్దాల రామారావు అన్నారు. ఆడిట్‌శాఖలో ఆడిటర్‌గా పదవీ విమరణ చేసిన, నటులు, దర్శకుడు ఎండి ఖాజావలి పదవీ విమరణ సత్కార సభను శుక్రవారం సాహిత్య మండలి, గరికపాటి ఆర్ట్స్ థియేటర్, హేలాపురి కళాకారుల సంక్షేమ సంఘం, జిల్లా రచయితల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో సాహిత్య మండలి ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు ఖాజావలిని శాలువ కప్పి పూలమాలలతో సత్కరించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ముద్దాల రామారావు మాట్లాడుతూ కళాకారుడిగా, నటుడిగా, దర్శకుడిగా, 27సార్లు నంది అవార్డు పొందడం గర్వకారణమన్నారు. డీపీఆర్వో ఆర్‌వీఎస్ రామచంద్రరావు, గరికిపాటి కాళిదాసు, పి.రామకృష్ణ, లంకా వెంకటేశ్వర్లు, ఆలపాటి నాగేశ్వరరావు, వుల్ల బోట్ల పురుషోత్తమరావు, గురుశర్మ, కళాకారులు, నగర ప్రముఖులు ఉన్నారు.

సమాచార హక్కు చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ఏలూరుసిటీ, ఆగస్టు1(ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి షేక్ హబీబ్‌బాషా సూచించారు. ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్ ఏలూరు వారి ఆధ్వర్యంలో రైతులకు సమాచార హక్కు చట్టంపై ఏలూరులోని ఐఏడీపీ హాలులో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల జవాబుదారీతనం, పారదర్శకత కలిగి ప్రజలకు అవసరమగు సమాచారాన్ని సమగ్రంగా అందించేందుకు సమాచార హక్కు చట్టం ఉపయోగపడుతుందన్నారు. ఏపీసీఎన్ఎఫ్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వెంకటేష్ మాట్లాడుతూ నేలల ఆరోగ్య యాజమాన్యం, పురుగుమందుల అవశేషరహిత పంట ఉత్పత్తులు, తద్వారా ప్రజల ఆరోగ్య పరిరక్షణ మొదలగునవి ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల సాధ్యపడతాయన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ సాంకేతిక ఏవో కాళీమాతతో పాటు రైతులు, ప్రకృతి వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

'దృఢ సంకల్పంతోనే ఆశలకు కార్యరూపం'

ఏలూరు అర్బన్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి):విద్యార్థులు తమ ఆలోచనలను వ్యక్తీకరించడానికి, వాటిని కార్యరూపంలోకి తీసుకురావడానికి విశ్వాసం, దృఢసంకల్పం, నిబద్ధత అవసరమని సెయింట్ థెరిస్సా మహిళా కళాశాల సుపీరియర్ మదర్ ఎర్నెస్టైన్ ఫెర్నాండెజ్ అన్నారు. పిల్‌గ్రిమ్స్ ఆఫ్ హోప్ పేరిట శుక్రవారం ప్రపంచంలోని స్ఫూర్తిదాయక వ్యక్తుల గురించి వివరించే వేడుకను నిర్వహించారు. ఈ సందర్భంగా యూజీ, పీజీ కోర్సుల విద్యార్థినులకు కల్చరల్ కలైడోస్కోప్, హోప్ ఇన్ ఎ మినిట్, వాయిస్ ఆఫ్ హోప్, ఎకోస్ ఆఫ్ హోప్, ఫ్యూజన్ వాక్ అంశాల్లో సృజనాత్మక పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ, వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ సునీలారాణి, సిస్టర్ సుశీల, పలు శాఖల హెచ్‌వోడీలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

విరమించిన గిరిజనుల రిలే నిరాహార దీక్ష

బుట్టాయగూడెం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి):రెడ్డిగణపవరం రెవెన్యూ పరిధిలోని ఎల్‌టీఆర్ 1/70 చట్టం పరిధిలోని భూములను ఆర్అండ్ఆర్ ప్యాకేజీలో కొనుగోలు చేయవద్దంటూ జగ్గిశెట్టిగూడెం గిరిజనులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలను శుక్రవారం విరమించారు. సీపీఎం మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ గిరిజనులకు నిమ్మరసం ఇచ్చి దీక్షలను విరమింపజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 30 ఏళ్లగా గిరిజనుల సాగులో ఉన్న ఎల్‌టీఆర్ చట్టం భూములను ఆర్అండ్ఆర్‌లో అమ్మకాలు జరపాలని గిరిజనేతరులు ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలిపారు. తహసీల్దార్ అందుబాటులో లేకపోవడంతో డీటీ పి.రమేష్‌కు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. రెవెన్యూ అధికారుల హామీతో దీక్షలను విరమిస్తున్నట్టు తెలిపారు. ఉనుముల సూర్యచంద్రం, ఉనుముల బాబూరావు పాల్గొన్నారు.

ఇల్లా.. స్థలమా!

(3వ పేజీ తరువాయి)

కావొచ్చింది. ఈనెల 15వ తేదీ నాటికి పట్టాలు పంపిణీకి సిద్ధం కావాల్సిందిగా జిల్లా యంత్రాంగానికి పరోక్ష సంకేతాలు పంపారు. ఆమేరకు ఇప్పటికే కలెక్టర్ అధ్యక్షతన ఇంటి జాగాల దరఖా స్తులపై సమీక్ష సాగింది. వచ్చిన చిక్కల్లా ఏమిటంటే ఇప్పటికే అర్హులైన వారంతా పూర్వ జగనన్న కాలనీల్లో ఇంటి స్థలం లభించి ఆ మేరకు నిర్మాణంకు సన్నద్ధం కాలేనివారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని కొంత కాలం పాటు ఆనోట ఈనోట ప్రచారం సాగింది. కాని దీనిపై యంత్రాంగం స్పష్టత ఇవ్వలేదు. అయితే ఇప్పటికే దరఖాస్తు చేసు కున్న వారంతా తమకు ఎక్కడా ఇంటి జాగా రాలేదని, పార్టీ పక్షపాతంగా తమను పక్కన పెట్టారని కొందరు, సమాచారం లేకపోవడంతో సరైన సమయంలో తాము దరఖాస్తు చేసుకోలేదని ఇంకొందరు పేర్కొంటూ తాజాగా దరఖాస్తులకు సిద్ధమయ్యారు. వీటి పరిశీలన, అందచేత ఎప్పుడు అనేదే ఇప్పటికీ లబ్ధిదారుల్లో ఉత్కంఠగా మారింది. దీనికి ప్రభుత్వం ఒక స్పష్టత ఇస్తేనే తప్ప లబ్ధిదారుల్లో ఉన్న మీమాంస తీరడానికి మార్గమేలేదు.



ఏలూరులో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చంటి, రెడ్డి అప్పలనాయుడు, తదితరులు



లింగపాలెంలో పింఛన్ అందిస్తున్న ఎమ్మెల్యే రోషన్‌కుమార్



తిరుమలంపాలెంలో స్పౌజ్ పెన్షన్ అందిస్తున్న గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి

పండుగలా పింఛన్ల పంపిణీ

- ఎమ్మెల్యే బడేటి చంటి
- ఇంటింటికెళ్లి పింఛన్లు అందజేసిన ప్రజాప్రతినిధులు, అధికారులు

ఏలూరుటూటౌన్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ఎన్‌టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం పండుగ వాతావరణంలో జరిగిందని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ఏలూరు 40వ డివిజన్‌లో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. నియోజకవర్గంలో స్పౌజ్ పింఛన్లు 404మందికి నూతనంగా మంజూరయ్యాయన్నారు. డివిజన్ ఇన్‌చార్జి ప్రసాద్, అధ్యక్షుడు రెడ్డి కుమార్, క్లస్టర్ ఇన్‌చార్జి బొరోతు బాలాజీ, బొంతు చిన్న, ఇడా చైర్మన్ శివప్రసాద్, ఏఎంసీ చైర్మన్ పార్థసారథి, నగర కమిషనర్ భానుప్రతాప్, టీడీపీ నగర అధ్యక్షుడు చోడే వెంకటరత్నం, ఎస్ఎంఆర్ పెదబాబు, దుర్గారావు, తదితతరులు పాల్గొన్నారు.

●చింతలపూడి/జంగారెడ్డిగూడెం/ఏలూరు/కామవరపుకోట, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): చింతలపూడి నియోజకవర్గంలో స్పౌజ్ పింఛన్లు 674 మందికి మంజూరయ్యాయని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అన్నారు. రేచర్ల గ్రామంలో పింఛన్ల పంపిణీ కార్యక్ర మాన్ని ఆయన ప్రారంభించారు. గ్రామంలో ఎమ్మెల్యేకు హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. జంగారెడ్డిగూడెం పట్టణంలో మంజూరైన 80 మందికి స్పౌజ్ పింఛన్లను ఆయా వార్డు నాయకులతో కలిసి టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొండ్రెడ్డి కిశోర్ ఆధ్వర్యంలో అందజేశారు. అనారోగ్యంతో జంగారెడ్డిగూడెం ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మండలంలోని శ్రీనివాసపురం గ్రామానికి చెందిన తడికల ఇమ్మానుయేలుకు టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్రశేషు, మండల నాయకులు సచివాయ సిబ్బందితో కలిసి పింఛన్‌ను అందజేశారు. లింగపాలెం మండలం లింగపాలెంలో స్థానిక నాయకులతో కలిసి స్పౌజ్ పింఛన్లను ఎమ్మెల్యే రోషన్‌కుమార్ పంపిణీ చేశారు. గరిమళ్ల చలపతిరావు, మోరంపూడి మల్లికార్జునరావు, చెన్ను శ్రీనివాస్‌యాదవ్, రాధా కృష్ణ పాల్గొన్నారు. కామవరపుకోట మండలం కామవరపుకోటలో కొత్తగా మంజూరైన వితంతు పింఛన్లను మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరా మకృష్ణ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ కరిపోతు అనూష పాల్గొన్నారు.

● ఉంగుటూరు/నిడమర్రు/భీమడోలు : ఉంగుటూరు మండలంలో కొత్తగా మంజూరైన 189 పింఛన్లను ఎమ్మెల్యే ధర్మరాజు ఆధ్వర్యంలో లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్ భర్త ఎస్.అయ్యప్ప, సర్పంచి బండారు సింధుమధు, ఉప సర్పంచి పాతూరి జగదీష్, బీజేపీ నాయకులు అడపా శోభారాణి పాల్గొన్నారు. నారాయణపురంలో మాజీ ఎంపీపీ గోలి శ్రీనివాసరావు నేతృత్వంలో పింఛన్లు అందించారు. నిడమర్రు మండలం భువ్వనపల్లి గ్రామంలో వృద్ధులు, వితంతువులకు పింఛన్లను ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అందజేశారు. పార్టీ గ్రామ అధ్యక్షుడు అల్లుమోలు అరుణ్‌కుమార్, మండల కన్వీనర్ నిమ్మల దొరబాబు, గ్రామ సర్పంచ్ కిలారి సత్యవతిరవిబాబు పాల్గొన్నారు. భీమడోలు మండలం గుండుగొలనులో ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు పింఛన్ల సొమ్ము పంపిణీ ప్రారంభించారు. గ్రామాల్లో కూటమి నేతలు ఇంటింటికి తిరిగి పింఛన్లు అందించారు. ఏఎంసీ చైర్మన్ శేషగిరి, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు ప్రత్తి మదన్, పుల్లయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

●దెందులూరు:దెందులూరు మండలంలో 8,300 మందికి పింఛన్లు అందించామని ఎంపీడీవో కంతేటి శ్రీదేవి, టీడీపీ మండల అధ్యక్షుడు మాగంటి నారాయణప్రసాద్ తెలిపారు. మండలంలో మొత్తం 93 శాతం పింఛన్లు అందజేశామని ఎంపీడీవో శ్రీదేవి తెలిపారు. గ్రామ రెవెన్యూ, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

● ద్వారకాతిరుమల:ద్వారకాతిరుమల మండలం తిరుమలం పాలెంలో స్పౌజ్ పింఛన్లను గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు ఆధ్వర్యంలో అందజేశారు. నాయకులు లంకా సత్తిపండు, పోలిన శ్రీను, మాసిరెడ్డి హరిబాబు, మటపర్తి బద్రి, మాసిరెడ్డి గాంధీ, పావులూరి నెహ్రూ, మాజీ సర్పంచ్ పాకలపాటి రామచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

●పోలవరం/టి.నరసాపురం:పోలవరం మండలంలో స్పౌజ్ పెన్షన్లను ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఎంపీడీవో చెరుకూరి శ్రీనివాస్‌బాబు, కూటమి నేతలు గునపర్తి చిన్ని, మంగిన కొండ, మంగిన పోశీరత్నం, మేడుం పార్వతి, పి నారాయణరావు, సర్పంచ్ పొడుం పుష్ప తదితరులు పాల్గొన్నారు. టి.నరసాపురం మండలంలో 104 కొత్త స్పౌజ్ పింఛన్లను కూటమి నాయకులు పంపిణీ చేశారు. కె.జగ్గవరంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జయవరపు శ్రీరామమూర్తి, తిరుమలదేవిపేట పంచాయతీలో టీడీపీ రాష్ట్ర తెలుగుయువత కార్యదర్శి తోట లక్ష్మీనారాయణ, అప్పలరాజుగూడెంలో పోలవరం నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు గన్నిన సురేంద్రనాద్ చౌదరి, తెడ్లంలో కేతిరెడ్డి వీరారెడ్డి ఆధ్వర్యంలో పింఛన్లు అందజేశారు.



విలేకరులతో మాట్లాడుతున్న శేషు

అభివృద్ధికి బ్రాండ్ అంబాసిడర్ సీఎం చంద్రబాబు

జంగారెడ్డిగూడెం:అభివృద్ధికి బ్రాండ్ అంబాసిడర్ సీఎం చంద్రబాబు అని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ దాసరి శ్యామ్ చంద్రశేషు అన్నారు. శుక్రవారం పట్టణంలో టీడీపీ మండల అధ్యక్షుడు సాయిల సత్యనారాయణ ఆధ్వర్యంలో విలేకరుల సమావే శంలో ఆయన మాట్లాడారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావడానికి దేశాలన్నీ పర్యటిస్తూ ఉంటే రాష్ట్ర గౌరవాన్ని దెబ్బతీసేలా రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా ఆయా కంపెనీలకు వైసీపీ నాయకులు దొంగ మెయిల్స్ పెడుతున్నారని విమర్శించారు. టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కుక్కల మాధవరావు, బి. సత్యనారాయణ రెడ్డి, రాగాని శ్రీనివాసరావు, తాళ్లూరి వెంకటేశ్వరరావు, పులపాకుల ప్రసాద్, ఎడ్లపల్లి కిరణ్ పాల్గొన్నారు.

'తలారి ప్రకాశ్‌పై అక్రమ కేసులు ఎత్తివేయాలి'

ఏలూరు రూరల్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా అధ్యక్షుడు తలారి ప్రకాశ్‌పై పెట్టిన అక్రమ కేసును ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం అఖిల భారత రైతు కూలీ సంఘం ఏలూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ తలారి ప్రకాశ్‌పై ఇటీవల రైస్ మిల్లు స్థలం విషయంలో అతడిపై అకారణంగా దాడి చేసి తాళ్లతో బంధించి చిత్ర హింసలకు గురి చేశారని ఆరోపించారు. బాధితుడు ప్రకాశ్ మాట్లాడుతూ కామవరపుకోట మండలం జోగడగూడెంలో తాను నివాసం ఉంటూ పదేళ్ల నుంచి రైస్ మిల్లు స్థలం లీజుకు తీసుకున్నానని, తన స్థలంలోకి కొంతమంది ఆకతాయిలు గంజాయి, మద్యం సేవిస్తున్నారని, స్థలం చుట్టూ ఫెన్సింగ్ వేస్తుండగా అదే గ్రామానికి చెందిన 12 మంది అకారణంగా దాడి చేసి కొట్టారన్నారు. కులం పేరుతో దూషించారని ఆరోపించారు. ఈకేసులో తనపై పోలీసులు అక్రమ కేసులు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. జంగారెడ్డిగూడెం పీడీఎస్‌యూ నాయకులు మామిడి రూపశంకర్, పి.రమేష్, జి.సత్యనారాయణ, అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు ఏసుపాదం, తదితరులు పాల్గొన్నారు.



ప్రజలకు సూచనలు చేస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ అమృతం

చెత్త నిల్వలు పెరిగితే సమాచారమివ్వాలి

- డీఎంహెచ్‌వో డాక్టర్ అమృతం

ఏలూరు అర్బన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : అంటురోగాల వ్యాప్తిపై ఏఎన్ఎంలు ఇంటింటా ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సమయంలోనే మురుగుకాల్వల్లో చెత్తాచెదారం నిల్వలు పెరిగిపోయి, మురుగునీటి పారుదలకు ఆటంకంగా ఉన్నట్టు గమనిస్తే వెంటనే సచివాలయ శానిటేషన్ కార్యదర్శులకు సమాచారమివ్వాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పీ.జే.అమృతం ఆదేశించారు. శుక్రవారం స్థానిక గజవల్లివారిచెర్వు అర్బన్ పీహెచ్‌సీ పరిధిలోని తోటకూరదొడ్ల ఏరియా వీధుల్లో ఏఎన్ఎంలు నిర్వహిస్తోన్న ఇంటింటా సర్వేను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడే తాగునీటి కుళాయిల పైప్‌లైన్ల లీకేజీని పరిశీలించి, తక్షణమే ఈ విషయాన్ని సచివాలయ సిబ్బందికి సమాచారం ఇవ్వాలని సూచించారు. అంటువ్యాధుల నియంత్రణ, నివారణ చర్యల సమాచారాన్ని నమోదుచేయడానికి ఉద్దేశించిన వెక్టర్ కంట్రోల్ అండ్ హైజీన్ యాప్ వినియోగాన్ని మొక్కుబడిగా కాకుండా వాస్తవ సమాచారాన్ని నమోదుచేయాలనానరు. అనంతరం వైద్యసిబ్బంది నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు. సాథనిక వైద్యాధికారి బాలకృష్ణ, అసిస్టెంట్ మలేరియా అధికారి గోవిందరావు, వైద్యసిబ్బంది, ఆశ, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళా రక్షణ చట్టాలపై అవగాహన ఉండాలి

బుట్టాయగూడెం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వం మహిళలు, యువతులు, బాలికల రక్షణ కోసం అమలు చేస్తున్న చట్టాలపై అవగాహన ఉండాలని ఎస్ఐ డి.దుర్గామహేశ్వరావు బాలికలకు సూచించారు. శుక్రవారం కేఆర్‌పురం ఐటీడీఏ పరిధిలోని రాజానగరం గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలలో మహిళా రక్షణ చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయులు పాఠ్యాంశాల బోధనతోపాటుగా మహిళా రక్షణ చట్టాలను పిల్లలకు వివరించాలన్నారు.

5న స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని ధర్నా

టి.నరసాపురం, ఆగస్టు1(ఆంధ్రజ్యోతి):ప్రజలను దోపిడీ చేసేందుకు ప్రయత్నాలు చేపడుతున్న స్మార్ట్‌మీటర్లను వెంటనే రద్దు చేయాలని ప్రజాసంఘాల నేతలు బీఎన్.సాగర్, గుడెల్లి వెంకట్రావు, కారం భాస్కర్లు డిమాండ్ చేశారు. స్మార్ట్‌మీటర్లు రద్దు చేయాలని కోరుతూ ఆనెల 5న నిర్వహించే రాష్ట్ర వ్యాప్తధర్నాను విజయవంతం చేయాలని సీపీఐ, సీపీఎం, సీపీఐ ఎంఎల్ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో స్థానిక ప్రజాసంఘాల కార్యాలయం వద్ద స్థానికులు ధర్నా పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 5న అన్ని మండల కేంద్రాల్లో జరిగే ధర్నా కార్యక్రమాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ప్రజాసంఘాల నేతలు, కొండముచ్చు శ్రీనివాసరావు, వయ్యాగాని ఏకాంబరధరరావు, మడకం కుమారి, సుధారాణి, సీతారామయ్య, కూసం సూర్యరావు పాల్గొన్నారు.

● కుక్కునూరు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): స్మార్ట్‌మీటర్ల విధానాన్ని రద్దు చేయాలని సీపీఐ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేస్తూ సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. శుక్రవారం స్మార్ట్‌మీటర్లపై ప్రజాభిప్రాయాన్ని తీసుకుని సంతకాలు సేకరించారు. పెరిగిన విద్యుత్ ఛార్జీలు తగ్గించి స్మార్ట్‌మీటర్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి కొన్నే లక్ష్మయ్య, వరక శ్యామలా, కే.బాబు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి దిశగా పాలన

దెందులూరు, ఆగస్టు1(ఆంధ్రజ్యోతి): సంక్షేమం, అభివృద్ధి దిశగా కూటమి పాలన సాగుతోందని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. శుక్రవారం కొవ్వలి గ్రామంలో 'సుపరిపాలనలో తొలి అడుగు' నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ మండల అధ్యక్షుడు మాగంటి మిల్లుబాబు, చిన్నారావు, బ్యాంకు అధ్యక్షుడు వెలమాటి అనిల్, వెలమాటి రాంబాబుతో కలిసి ఇంటింటికి వెళ్లి సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఎన్టీఆర్, అంబేడ్కర్ విగ్రహాలకు మాజీ ఎంపీటీసీ నిట్టా సుభాకర్‌రావుతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు, పార్టీ ఉపాధ్యక్షుడు గోవాడ నాగరాజు, కసుకుర్తి రామకృష్ణ, మాజీ బ్యాంక్ చైర్మన్ సునీల్‌రాజా, వెలమాటి అశోక్‌చక్రవర్తితో కలిసి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను చింతమనేని అందించారు. పార్టీ కార్యదర్శి రాజ్‌కుమార్, గోరిపర్తి శ్రీను, గద్దే అమరేశ్వరావు, బోడేటి మోహన్‌బాబు తదితరులు పాల్గొన్నారు



మంత్రి లోకేశ్‌ను కలిసిన చింతమనేని

లోకేశ్‌ను కలిసిన చింతమనేని

నియోజకవర్గ అభివృద్ధికి పూర్తిగా సహకారం అందిస్తామని మంత్రి నారా లోకేశ్ హామీ ఇచ్చారని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు. అమరావతిలో మంత్రి నారా లోకేశ్‌ను చింతమనేని కలిసి గత వైసీపీ చేసిన అరాచకాలు, చెరువుల అక్రమాలపై వివరించారని తెలిపారు.

పారిశ్రామిక ప్రగతే లక్ష్యం : చంటి

ఏలూరుటూటౌన్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పారిశ్రామికే ప్రగతే లక్ష్యంగా ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్తుందని ఎమ్మెల్యే చంటి అన్నారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా 19వ డివిజన్‌లో ఆయన పర్యటించారు. అన్నదాత సుఖీభవ పథకానికి ఏలూరు నియోజకవర్గంలో రూ.200 కోట్లు ప్రభుత్వం కేటాయించిందన్నారు. తొలివిడతగా శనివారం రూ.66 కోట్లు రైతుల ఖాతాల్లో జమ కానున్నాయన్నారు. డివిజన్ ఇన్‌చార్జి పైడి పార్వతి, కార్పొరేటర్ నాగబాబు, అంబటి రజనీకుమార్, భాస్కరరావు, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

'తల్లిపాలు బిడ్డకు అమృతం'



తల్లిపాల విశిష్టతను వివరిస్తున్న సూపర్‌వైజర్ జోషి

ఏలూరు రూరల్/ఉంగుటూరు/బుట్టాయగూడెం/ భీమడోలు /జంగారెడ్డిగూడెం, ఆగస్టు 1, (ఆంధ్రజ్యోతి): తల్లిపాలు బిడ్డకు అమృతం వంటివని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ టి.జోషి తెలిపారు. ఏలూరు మండలం భూరాయిగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలలో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఏఎన్ఎం ఎం.తులసమ్మ, మహిళా సంరక్షణ అధికారి లక్ష్మీతులసి, అంగన్‌వాడీ కార్యకర్త ఆర్.రత్నకుమారి, ఆశావర్కర్లు పాల్గొన్నారు. ఉంగుటూరు మండలం ఉంగుటూరు సెక్టార్ పరిధిలోని అంగన్వాడీల వర్కర్లు, ఆయాలు తల్లిపాల వారోత్సవాలపై సెక్టార్ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బుట్టాయగూడెం మండలం దొరమామిడిలో సీడీపీవో యూవీఎన్ పద్మావతి ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. సూపర్‌వైజర్ వై.వెంకటలక్ష్మి, అంగన్‌వాడీ వర్కర్లు, పాల్గొన్నారు. భీమడోలు మండలం గుండుగొలను, అంబర్‌పేట గ్రామాల్లో గుండుగొలను ప్రాథమిక వైద్య కేంద్రం వైద్యురాలు జాహ్నవి ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. సూపర్ వైజర్లు, కవిత, అంగన్‌వాడీ కార్యకర్తలు రాజామణి, రమాదేవి, అన్నమ్మ, సత్యవేణి పాల్గొన్నారు. జంగారెడ్డిగూడెం పట్టణం, మండలంలోని అంగన్వాడీ కేంద్రాల్లో ఐసీడీఎస్ సీడీపీవో పి.బ్యూలా ఆధ్వర్యంలో తల్లిపాల విశిష్టతపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి, ఆయా కేంద్రాల టీచర్లు జగదీశ్వరి, వరలక్ష్మి, ఏఎన్ఎంలు, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

నేత్రపర్వం.. సుదర్శన హోమం



సుదర్శన నృసింహ యజ్ఞాన్ని జరుపుతున్న పండితులు

ద్వారకాతిరుమల, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ఐఎస్ జగన్నాథపురంలోని సుందరగిరిపై కొలువుదీరిన లక్ష్మీనారసింహుని ఆలయంలో స్వామివారి జన్మనక్షత్రాన్ని పురస్కరించుకుని శుక్రవారం విశేష కార్యక్రమాలు జరిగాయి. శ్రీవారి ప్రధాన ఆలయానికి దత్తత దేవాలయమైన ఈ ఆలయంలో సుందరీకరించిన యాగశాలలో శ్రీసుదర్శన నృశింహ ధన్వంతరి గరుడ అంజనేయ అనంత మూల మంత్రహోమం జరిగింది. ఆ తరువాత మూలవిరాట్‌కు విశేష ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. సుదర్శన హోమం అనంతరం శ్రీమహాపూర్ణాహుతిని జరుపగా భక్తులు పాల్గొన్నారు..

కుంకుళ్లమ్మకు విశేషపూజలు

శ్రావణమాస రెండో శుక్రవారాన్ని పురస్కరించుకుని ద్వారకాతిరుమల శ్రీవారి క్షేత్ర దేవతగా విరాజిల్లుతోన్న కుంకుళ్లమ్మ ఆలయాన్ని సుగంధ భరిత పుష్పమాలికలు, మామిడి తోరణాలు. అరటిబోదెలతో సుందరీకరించింది. అర్చకులు అమ్మవారికి విశేష పుష్పాలంకరణ అనంతరం కుంకుమపూజలు జరిపారు. ఆలయ యాగశాలలో చండీహోమాన్ని నిర్వహించారు.

రాధాకృష్ణుల కల్యాణం

ఉంగుటూరు : కైకరం వేణుగోపాల స్వామి ఆలయంలో శుక్రవారం రాధాకృష్ణుల కల్యాణం జరిగింది. ఆలయ వార్షికోత్సవంలో భాగంగా ఆలయ ధర్మకర్త ముత్తంగి వేణుగోపాలకృష్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో పలు జంటలు కూర్చుని కల్యాణమహోత్సవం జరిపించారు. అనంతరం భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

'అగ్ని ప్రమాద బాధితులకు అండగా ఉంటాం'

ఏలూరు రూరల్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): స్థానిక 8వ డివిజన్ తూర్పువీధిలోని సింహాచల సందులో గురువారం రాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన బాధితులకు జనసేన పార్టీ అండగా ఉంటుందని ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు అన్నారు. శుక్రవారం ఉదయం ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధితుడు తారకరామ్ కుటుంబాన్ని పరామర్శించి, అండగా ఉంటమని హామీ ఇచ్చారు. జోనల్ డివిజన్ ఇన్‌చార్జి ఒబిలిశెట్టి శ్రావణ్‌కుమార్ గుప్తా, స్థానిక నాయకులు సూదాబత్తుల హరీష్, స్వామి, పవన్, తదితరులు ఉన్నారు.

నేడు పీఎం కిసాన్ నిధుల విడుదల

కొయ్యలగూడెం,ఆగస్టు1(ఆంధ్రజ్యోతి): అన్న దాత సుఖీభవ పీఎం కిసాన్ మొదటి విడత నిధులు శనివారం విడుదలవుతున్నాయని ఏవో టీకేవీఎన్.పోశారావు తెలిపారు. శనివారం కేఆర్.పురం ఐటీడీఏ వద్ద పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు నిధులు విడుదల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. పోలవరం నియోజకవర్గంలో 34,037మంది అర్హత కలిగిన రైతులు ఉన్నారని, రూ.22.77 కోట్లు విడుదల కానున్నట్లు ఆయన తెలిపారు.

సీతంపేట సొసైటీ పరిధిలో రైతులకు రుణాల అందజేత

దెందులూరు,ఆగస్టు1 (ఆంధ్రజ్యోతి):రైతుల అభివృద్ధి, సంక్షేమానికి ప్రణాళికబద్ధంగా సీతంపేట సహకార సంఘం బ్యాంక్ ద్వారా రైతులకు రుణాలను అందించామని సీతంపేట సొసైటీ బ్యాంక్ అధ్యక్షుడు యలమర్తి వెంకట సత్యనారాయణ అన్నారు, శుక్రవారం చల్లచిం తలపూడిలో సీతంపేట బ్రాంచి కార్యాలయంలో రైతులకు రూ.కోటి 59 లక్షల పంట రుణాలను బ్యాంక్ కార్యదర్శి సరిగే పెద్దిరాజు, డైరెక్టర్లు నర్రవుల గంగాభవాని, రామచంద్రరావు, భీమడోలు సహకార బ్యాంక్ మేనేజర్ ఓ రమేష్‌తో కలిసి అందజేశారు. టీడీపీ మండల కార్యదర్శి నాగనబోయిన సత్య నారాయణ, మాజీ సర్పంచ్ ముమ్మడి మోహన్‌రావు, గ్రామ అధ్యక్షుడు వేమన రాముగౌడ్ పాల్గొన్నారు

నేడు విద్యుత్ నిలుపుదల ప్రాంతాలు

ఏలూరు రూరల్, ఆగస్టు1(ఆంధ్రజ్యోతి): ఏలూరు రామచంద్రరావుపేట సెక్షన్ పరిధిలో ఉన్న విద్యుత్ లైన్ మరమ్మతు కారణంగా శనివారం ఉదయం 6 నుంచి 9 గంటల వరకు కరెంట్ ఉండదని పోలీస్ క్వార్టర్స్, ఎస్పీ ఆఫీసు, పరేడ్ గ్రౌండ్, అమీనపేట ఏటిగట్టు, సీఎస్ఐ చర్చి, కలెక్టర్ ఆఫీసు వెనుకాల ఏటిగట్టు ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

● టి.నరసాపురం: ఎస్ఎస్ రాజుపోతేపల్లి సబ్‌స్టేషన్ పరిధి లోని 11కేవీ కొత్తగూడెం, 11కేవీ రాజుపోతేపల్లి ఫీడర్లపై ఆర్‌డీఎస్ఎస్ లైన్‌పనులు, ట్రీకటింగ్, నిమిత్తం శనివారం, ఆదివారం కరెంట్ సరఫరా నిలిపివేస్తామని జంగారెడ్డిగూడెం డివిజనల్ ఇంజనీర్ శ్రీఫీర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. ఆయా రోజుల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

● జంగారెడ్డిగూడెం : నిమ్మలగూడెం సబ్‌స్టేషన్ పరిధిలోని కట్టవపొదలవారిగూడెం, టెక్కినవారిగూడెం గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఈఈ పీర్ అహ్మద్ ఖాన్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ట్రీఫేస్, 24 గంటల సర్వీసు వేయు నిమిత్తం శనివారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యా హ్నం ఒంటి గంట వరకు సరఫరా నిలిచిపోతుందన్నారు.

5న పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

కలిదిండి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): కలిదిండి పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 5న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ ప్రసాద్ తెలిపారు. ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ విభాగాల కోర్సుల భర్తీకి అడ్మిషన్లు నిర్వహిస్తున్నామన్నారు. పదవ తరగతి పాసైన విద్యార్థులు, పాలిటెక్నిక్ ఎంట్రన్స్ రాసిన వారు, రాయనివారు కూడా అర్హులని తెలిపారు. ఫీజు తదితర వివరాలకు 90102 22192, 99516 69810 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

శ్రీమద్భాగవత ప్రవచనాలు



కైకలూరు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): కైకలూరు వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీమద్భాగవత సప్తాహ ప్రవచనాలు నిర్వహించారు. టీటీడీ విశ్రాంత సమన్వయ అధికారి శ్రీకృష్ణకుమారశర్మ ప్రవచనం చేశారు. భాగవత మహిమ, పరిరక్షిత చరిత్ర, ధృవచరిత్ర ప్రవచనాలను వివరించారు. ఆలయ ఈవో శేఖర్ కార్యక్రమాన్ని ప్రారంభించగా భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు.



నత్తగుల్లపాడులో రహదారికి అడ్డుగా నిలిపిన కారు

రహదారికి అడ్డంగా కారు నిలిపిన సర్పంచ్

నిలిచిన రాకపోకలు ▸▸ గ్రామస్థుల ఫిర్యాదు ▸▸ కేసు నమోదు

కైకలూరు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): కొల్లేరు గ్రామాల కట్టుబాట్ల మధ్య తనపట్ల వివక్ష చూపుతున్నారని సర్పంచ్‌నైనా తన మాట చెల్లడం లేదని రహదారికి అడ్డుగా సర్పంచ్ కారు నిలిపి రాకపోకలను అడ్డగించిన సంఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. కైకలూరు మండలం నత్తగుల్లపాడు సర్పంచ్ ముంగర రామకృష్ణంరాజు శుక్రవారం సాయంత్రం రహదారికి అడ్డుగా కారు నిలిపాడు. ఆ సమయంలో గ్రామానికి చెందిన ముంగర నాగమణి ద్విచక్ర వాహనంపై తన మనవరాలిని ఆసుపత్రికి తీసుకువెళుతుండగా కారు అడ్డుగా పెట్టడంపై సర్పంచ్‌ని ప్రశ్నించింది. అయితే కారు అడ్డు తీసేందుకు నిరాకరించి సర్పంచ్ ఇంటికి వెళ్లిపోయాడు. దీంతో గ్రామానికి వెళ్లేందుకు వచ్చేందుకు దారి లేకపోవడంతో సుమారు 3 గంటలు రాకపోకలు నిలిచిపోయాయి. గ్రామంలోని ప్రజలంతా కారు నిలిపిన ప్రదేశానికి తరలివచ్చారు. సర్పంచ్ కారుగా గుర్తించి గ్రామపెద్దలు కారు తీయమని ఇంటికి కబురు చేసినా సర్పంచ్ ససేమిరా అన్నాడు. తన మాట గ్రామంలో చెల్లటం లేదని ఇటీవల తన ఇంటి మీదికి కొందరు వచ్చి ప్రశ్నించారని, ఇప్పుడు ఎవరొచ్చి ఏం చేస్తారో చూస్తాను కారు తీయనంటూ సమాధానమిచ్చాడు. దీంతో ఆగ్రహించిన ప్రజలు 112కు కాల్ చేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో కైకలూరు రూరల్ పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని సర్పంచ్‌తో మాట్లాడినా కారు తీసేందుకు నిరాకరించాడు. దీంతో వీఆర్వో వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు కారుని కైకలూరు రూరల్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. ముంగర నాగమణి ఫిర్యాదు మేరకు కైకలూరు రూరల్ ఎస్సై వి. రాంబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ముసునూరులో నూతన పెన్షన్ల పంపిణీ



కలిదిండిలో స్పౌజ్ పింఛన్ల పంపిణీ



పింఛన్లు పంపిణీ చేస్తున్న నూజివీడు ఎంపీడీవో



కైకలూరులో పెన్షన్ల పంపిణీ



చనుబండలో కొత్త పింఛన్ల పంపిణీ



విశ్వనాద్రిపాలెంలో పెన్షన్ల పంపిణీ

పింఛన్ల పండుగ

▸▸ లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అధికారులతో పాటు కూటమి నాయకుల అందజేత

▸▸ కొత్తగా మంజూరైన స్పౌజ్ పెన్షన్ల పంపిణీ

ముసునూరు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): కూటమి పాలనలోనే అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాల లబ్ధి చేకూరుతోందని సర్పంచ్ కొండేటి విజయలక్ష్మి యిర్మీయా, టీడీపీ మండల మాజీ అధ్యక్షులు దేవినేని ఢలరాం అన్నారు. ముసునూరు మండల వ్యాప్తంగా 136 మందికి నూతనంగా మంజూరైన ఎన్టీఆర్ భరోసా వితంతు పెన్షన్లను కూటమి నాయకులు లబ్ధిదారులకు శుక్రవారం పంపిణీ చేశారు. ముసునూరులో సర్పంచ్, ఉప సర్పంచ్ తోట శ్రీనివాసరావు, టీడీపీ గ్రామ అధ్యక్షులు గార్లపాటి నరసింహారావు, నియోజకవర్గ బీసీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ నక్కా యోహాను, దేవినేని శ్రీధర్ తదితరులు 22 మందికి కొత్త పెన్షన్‌లను పంపిణీ చేశారు. చెక్క పల్లిలో సర్పంచ్ టి. రాధిక సత్యనారాయణ, ఎంపీటీసీ కాటేపల్లి పుష్పావతి శ్రీనివాసరావు, టీడీపీ గ్రామ అధ్యక్షులు కాటేపల్లి సత్యనారాయణ తదితరులు 12 మందికి అందజేశారు. గోపవరంలో గ్రామ అధ్యక్షుడు గణేష్, నాయకులు 22 మందికి కొత్త పెన్షన్లతో పాటు స్వీట్లు పంచారు. పలు గ్రామాల్లో పెన్షన్‌ల పంపిణీని ఎంపీడీవో సత్యనారా యణ తనిఖీ చేశారు. మండలంలో 95 శాతం పెన్షన్ల పంపిణీ పూర్తయినట్టు ఆయన తెలిపారు.

కలిదిండి: మండలంలో స్పౌజ్ నూతన పింఛన్లను శుక్రవారం లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పంపిణీ చేశారు. కలిదిండిలో ఎంపీడీవో ఫణీంద్ర కూటమి నాయకులతో కలసి వితంతువులకు నూతన పింఛన్లను పంపిణీ చేశారు. 103 స్పౌజ్ పింఛన్లు మంజూరైనట్టు ఎంపీడీవో తెలిపారు. టీడీపీ మండల అధ్యక్షులు పోకల జోగిరాజు, ఏఎంసీ మాజీ ఛైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరి, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ లంకా రత్నారావు, కలిదిండి సర్పంచ్ మారుతీ ప్రసన్న, ఈవో ఉదయ్ కుమార్ పాల్గొన్నారు.

చాట్రాయి: సీఎం చంద్రబాబు పేదల జీవితాల్లో వెలుగు నింపుతున్నారని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి మందపాటి బసవారెడ్డి, తెలుగురైతు జిల్లా ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు అన్నారు. మండలంలో కొత్తగా మంజూరైన 166 స్పౌజ్ పెన్షన్లను శుక్రవారం గ్రామ సచివాలయాల వద్ద ఆయా గ్రామాల కూటమి నాయకులు పంపిణీ చేశారు. అలాగే మండలంలో సామాజిక పెన్షన్లు 8356 ఉండగా శుక్రవారం సాయంత్రానికి 88 శాతం పంపిణీ చేసినట్లు, మిగిలిన వారికి శనివారం పంపిణీ చేస్తామని అధికారులు తెలిపారు.

నూజివీడు టౌన్: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ఎన్టీఆర్ భరోసా పెన్షన్ అందిస్తున్నట్లు నూజివీడు ఎంపీడీవో చెన్ను రాఘవేంద్రనాథ్ అన్నారు. నూజివీడు మండలం ఎంఎస్‌పాలెంలో పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. నూజివీడు మండల వ్యాప్తంగా 10,407 మందికి రూ.4.47 కోట్లు పింఛన్లను పంపిణీ చేశామన్నారు.

కైకలూరు: ఎన్నికల హామీ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్పౌజ్ పెన్షన్ అందిస్తున్నారని మండల టీడీపీ అధ్యక్షుడు పెన్మెత్స త్రినాధరాజు అన్నారు. శుక్రవారం కైకలూరు 2, 3 సచివాలయాల పరిధిలో త్రినాధరాజు ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి పెన్షన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో భర్త చనిపోతే భార్యకు పెన్షను అందకుండా చేశారని చంద్రబాబు ఆదేశాలతో అలాంటి మహిళలకు పెన్షన్ అందజేస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం హామీలకు కట్టుబడి అంచెలంచెలుగా అన్ని అమలు చేస్తోందన్నారు. పార్టీ పట్టణ మాజీ అధ్యక్షుడు ఎండీ జానీ, అధ్యక్షుడు పడమటి వాసు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. కైకలూరు వెలమపేటలో పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో సర్పంచ్ కేవీఎన్ఎం నాయుడు, రాష్ట్ర తెలుగుయువత కార్య నిర్వహణ కార్యదర్శి పూల రామచంద్రరావు, ఎస్సీ సెల్ నాయకుడు సుధా, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ముదినేపల్లి: మండలంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు శుక్రవారం 92 శాతం పంపిణీ చేశారు. మండలంలో 8787 మంది పెన్షనర్లకు రూ.3.84 కోట్లు పంపిణీ చేయాల్సి ఉండగా, సుమారు 8100 మందికి రూ.3.10 లక్షలు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో రామకృష్ణ తెలిపారు. మండలానికి కొత్తగా మంజూరైన 148 స్పౌజ్ పింఛన్లలో 90 మందికి అందజేసినట్లు తెలిపారు. పెదగొన్నూరులో డీసీ ఛైర్మన్ గుడిసేవ సురేష్, టీడీపీ గ్రామ అధ్యక్షుడు యార్లగడ్డ గంగయ్య, పార్టీ బీసీ సెల్ మండల కార్యదర్శి వీరంకి చక్రపాణి, ముదినేపల్లిలో సర్పంచ్ కైకమ్మ, ఉప సర్పంచ్ సుధాకర్, కూటమి నాయకులు, పంచాయతీ కార్యదర్శి రమేష్ కొత్త పింఛన్లు పంపిణీ చేశారు.

మండవల్లి: పేద కుటుంబాల ఆర్థికాభివృద్ధి కూటమి ప్రభుత్వం వల్లే సాధ్యమని కూటమి నాయకుడు గుడివాడ చిట్టిబాబు పేర్కొన్నారు. మండవల్లి పంచాయతీ పరిధిలో కొత్తగా మంజూరైన పెన్షన్లను సర్పంచ్ మెండ ఝాన్సీతో కలిసి పంపిణీ చేశారు.

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సుపరిపాలన : మంత్రి సారథి



సుపరిపాలనపై ఆరా తీస్తున్న మంత్రి

ఆగిరిపల్లి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సుపరిపాలన అందించడమే కూటమి లక్ష్యమని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. మండలంలోని తోటపల్లిలో శుక్రవారం స్వయంగా పలువురు లబ్ధిదారులు ఇంటికి వెళ్లి మంత్రి ఎన్టీయార్ భరోసా పెన్షన్లు అందజేశారు. గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు తమకు ఇచ్చిన అధికారాన్ని బాధ్యత భావిస్తున్నామని, ప్రజల సమస్యలను వారి వద్దకే వచ్చి అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. సంక్షేమంతో పాటు అభివృద్ధికి కూడా ప్రాధాన్యత ఇచ్చి రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నడిపిస్తున్నారు. మార్చి నుంచి పేదల ఇళ్ళ నిర్మాణం చేపట్టి పూర్తి చేస్తామని, ఇంటి పట్టాలు లేని వారికి పట్టాలు పంపిణీ చేస్తామని తెలిపారు. తల్లికి వందనం రానివారికి సంబంధిత అధికారులను సమస్యను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. త్వరలో గ్రామంలోని డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరుస్తామన్నారు. అనంతరం కొత్త ఈదర గ్రామానికి చెందిన బి. శ్రీనివాసరావు అనారోగ్యంతో బాధపడుతుండడంతో రూ.50వేలు ఎల్‌ఓసీ పత్రాన్ని మంత్రి అందజేశారు. మండలంలో 95% పెన్షన్లను అందజేశామని అధికారులు తెలిపారు. ఎంపీడీవో భార్గవి, డిప్యూటీ తహసీల్దార్ పవన్‌కుమార్, టీడీపీ మండల అధ్యక్షుడు వేణు తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్య పరిష్కరించిన టీడీపీ నాయకులు



ముసునూరు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని లోపూడి వేపచెట్టు సెంటర్‌లో డ్రైనేజీ సమస్య టీడీపీ నాయకులు సహకారంతో శుక్రవారం పరిష్కారమైంది. డ్రైనేజీ పూడుకుపోయి వర్షపునీరు, మురుగునీరు సైతం రహదారిపై ప్రవహిస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను పంచాయతీ దృష్టికి తీసుకువెళ్లినా చర్యలు తీసుకోకపోవడంతో టీడీపీ గ్రామ అధ్యక్షుడు చలమాల వెంకటేశ్వరరావు, నాయకుల సహకారంతో డ్రైనేజీ పూడిక తీసి మట్టిని ఎక్స్‌కవేటర్‌తో తొలగించి కొత్తగా సిమెంట్ తూరలను వేసి సమస్య పరిష్కరించారు. టీడీపీ నాయకుల పనితీరుపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. నాయకులు డోలా రాంబాబు, గంగాధర్, పంజుగల వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

రహదారిపై గోతులు పూడ్పించిన పోలీసులు



మండవల్లి ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): రహదారి మలుపులో ప్రమాద కరమైన గోతులను మండవల్లి పోలీసులు స్వచ్ఛందంగా పూడ్చి వేశారు. శుక్రవారం లోకుముడి సెంటర్లో ఆర్‌అండ్‌బీ రహదారిపై పడిన గోతులను పూడ్చివేశారు. మలుపులో ఏర్పడిన గోతులు కావడంతో వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని స్వచ్ఛందంగా ఎస్సై సీహెచ్ రామచంద్రరావు ఆధ్వర్యంలో ఈ పనులను నిర్వహించారు.

వాటర్ బాటిల్స్ వితరణ



ముసునూరు, ఆగస్టు 1(ఆంధ్ర జ్యోతి): చెక్కపల్లిలోని రెండు అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు తెలుగు యువత మండల అధ్యక్షుడు కాటేపల్లి గిరిబాబు స్టీల్ వాటర్ బాటిల్స్‌ను శుక్రవారం బహూకరించారు. సుమారు 30 మంది పిల్లలకు స్థానిక టీడీపీ నాయకులతో కలసి వాటర్ బాటిల్స్ పంపిణీ చేశారు. టీడీపీ గ్రామ అధ్యక్షులు కె.సత్యనారాయణ, నాయకులు కె.శ్రీనివాసరావు, టి.సత్యనారాయణ, కె.పిచ్చియ్య, ఎం.గిరిబాబు, బి.ఫణిబాబు తదితరులు పాల్గొన్నారు.

పెండ్లి కుమారుడికి బంగారు నాణెం అందజేత

చాట్రాయి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటపాడు పాల సహకార సంఘం సభ్యుడు మోరంపూడి వెంకట ధర్మారావు కుమారుడి వివాహం సందర్భంగా కృష్ణామిల్క్ యూనియన్ కల్యాణమస్తు పథకం కింద రూ. 20 వేలు విలువైన బంగారు నాణేన్ని శుక్రవారం సంస్థ డైరెక్టర్ బొట్టు రామచంద్రరావు పెండ్లి కుమారుడికి అందజేశారు. క్లస్టర్ మేనేజర్ దిలీప్‌కుమార్, సంఘం అధ్యక్షుడు మోరంపూడి వెంకటేశ్వరరావు, సూపర్‌వైజర్ నరసింహారావు పాల్గొన్నారు.



వాసవీ మాతకు సారె సమర్పణ

కైకలూరు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): కైకలూరు శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారికి శ్రావణమాస మహోత్సవాల సందర్భంగా సారెను అందజేశారు. శుక్రవారం కైకలూరు పూజిత అపార్ట్‌మెంట్‌లోని మహిళలంతా కలిసి అమ్మవారికి సారెను ఊరేగింపుగా తీసుకువచ్చారు. ఆలయ అర్చకులు విశేష పూజలను నిర్వహించారు. ఆల య కమిటీ అధ్యక్షుడు పైడిమర్రి రమేష్, ప్రధాన కార్యదర్శి పెను ముడి నాగవెంకట రామగంగా ధరరావు, కోశాధికారి శ్యామ్ ఏర్పాట్లు నిర్వహించి భక్తులకు ప్రసాదాన్ని అందజేశారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	105, 113, 124
చికెన్ విత్ స్కిన్	200
చికెన్ స్కిన్‌లెస్	210
నెక్ కోడి గుడ్డు ధర	(100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.475

5న సబ్ స్టేషన్ల వద్ద ధర్నా

చాట్రాయి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం హయాంలో వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటును తీవ్రంగా వ్యతిరేకించిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చాక అదే విధానాన్ని అమలు చేయటం దారుణమని నూజివీడు నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి నిమ్మగడ్డ నరసింహ ధ్వజమెత్తారు. స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ఆగస్టు 5న వామపక్షాల ఆధ్వర్యంలో సబ్ స్టేషన్ల వద్ద జరిగే నిరసన కార్యక్రమం జయప్రదం చెయ్యాలని కోరుతూ ప్రచురించిన కరపత్రాలను చిన్నంపేటలో శుక్రవారం పార్టీ నాయకులతో కలిసి నిమ్మగడ్డ ఆవిష్కరించారు. ప్రీపెయిడ్ విద్యుత్ విధానానికి వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమించాలని కోరారు. పార్టీ నియోజకవర్గ కార్యవర్గ సభ్యుడు శ్రీనివాస్, కౌన్సిల్ సభ్యుడు ఆనందం పాల్గొన్నారు.

వసతి గృహాల పరిశీలన

ముదినేపల్లి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): పోలీస్ ఉన్నతాధికార్ల ఆదేశాల మేరకు ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల నిర్వహణపై స్థానిక పోలీసులు నిఘా పెట్టారు. ముదినేపల్లిలోని సీఈ బాలుర వసతి గృహం, ఎస్సీ కళాశాల స్థాయి బాలుర వసతి గృహాల నిర్వహణను పోలీస్ సిబ్బంది గత నాలుగు రోజులుగా నిత్యం పరిశీలిస్తున్నారు. శుక్రవారం సానిక బీసీ బాలుర వసతి గృహంలో ఎస్‌ఐ వీరభద్రరావు పర్యవేక్షణలో ఏఎస్‌ఐ ఎ. శ్రీనివాస్, మహిళా హెచ్‌సీ సుధావాణి, ఇతర సిబ్బంది, విద్యార్థులను కలసి వసతి గృహంలో కల్పిస్తున్న సౌకర్యాలపై ఆరా తీయగా విద్యార్థులు బాగానే అమలు చేస్తున్నారని విద్యార్థులు తెలిపారు.

శ్రీశ్యామలాంబ అమ్మవారి ఆలయం కిటకిట

కైకలూరు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): శ్రావణమాస మహోత్సవాల సందర్భంగా కైకలూరు శ్రీశ్యామలాంబ అమ్మవారిని భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి దర్శించుకున్నారు. శ్రావణమాసం రెండో శుక్రవారం సందర్భంగా అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి పుష్పాలంకరణ కురేళ్ళ మురళీకృష్ణ చేయగా ఉచిత ప్రసాదాన్ని హేమాద్రి ఆక్వా ఫీడ్స్, ముదునూరి జానకీ రవీంద్ర సుబ్బరాజు, గొట్టుముక్కల శ్యామ్‌ప్రసాద్‌రాజు, కలిదిండి సూర్య నారాయణవర్మ, కూనంపూడి రామ కృష్ణంరాజు, చుక్కా శ్యామలరావు మరికొంతమంది దాతలతో కలిసి అందజేశారు. ఈవో శేఖర్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు నిర్వహించారు.

పోలీసుల అదుపులో గంజాయి నిందితులు?

ఏలూరు క్రైం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి):ఏలూరు టూ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ముగ్గురు యువకులు గంజాయిని విక్రయిస్తున్నట్లు సమాచారం ఉండడంతో పోలీసులు కొద్ది రోజులుగా నిఘా పెట్టి వారిని అదుపులోకి తీసుకు న్నారు. అయితే పూర్తిస్థాయిలో విచారణ చేపట్టారు. వారు ఆ గంజాయిని ఎక్కడ నుంచి ఎలా తీసుకువచ్చారు? వారికి ఎవరు విక్రయించారు ? ఇక్కడ ఎవరికి విక్రయిస్తున్నారు ? కొనుగోలు చేసేది ఎవరు ? అనే కోణంలో తమదైన శైలిలో పోలీసులు విచారణ చేస్తున్నట్లు తెలుస్తుంది. మొత్తం మీద ఈ ముగ్గురిని శనివారం అరెస్టు చేసే అవకాశాలు ఉన్నాయి. వారి నుంచి కొంత గంజాయి స్వాధీనం అయినప్పటికీ మిగిలిన గంజాయి ఎక్కడ ఎవరి దగ్గర ఉంది. వారితో ఎవరికి సంబంధాలు ఉన్నాయి అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

ఆధునిక వసతులతో జైళ్ల నిర్మాణం : డీజీ



కైకలూరు సబ్‌జైల్‌ను పరిశీలిస్తున్న డీజీ

కైకలూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): జైళ్ళ నిర్మాణంలో ఆధునిక వసతులను కల్పిస్తున్నట్టు జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ అంజినీకుమార్ అన్నారు. శుక్రవారం కైకలూరు సబ్ జైల్‌లో రూ. 2.11 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న నూతన సబ్ జైల్ పనులను పరిశీలించారు. నిర్మాణ పనుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. నాణ్యతా ప్రమాణాలను పాటించా లన్నారు. ఇక నుంచి స్త్రీలు, పురుషులకు వేర్వేరుగా జైళ్ల నిర్మా ణం జరుగుతుందన్నారు. జైళ్ల శాఖ డీఐజీ డాక్టర్ వరప్రసాద్, ఇన్‌చార్జి అధికారి ఉమా మహేశ్వ రరావు, మచిలీపట్నం జిల్లా జైలుశాఖ సూపరిం టెండెంట్ పిల్లా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఖైదీల ఉపాధికి జైళ్ల శాఖ తోడ్పాటు

భీమవరం క్రైం: రిమాండ్ ఖైదీల ఉపాధికి జైళ్ళ శాఖ ఎంతో కృషి చేస్తుందని, వారు ఈ అవకాశాన్ని సద్వినియోగపరచుకుని ముందుకు వెళ్ళాలని జైళ్ళ శాఖ డీజీ (డైరెక్టర్ జనరల్) అంజనీకుమార్ అన్నారు. శుక్రవారం భీమవరం సబ్ జైల్ వద్ద ఏర్పాటు చేసిన పెట్రోల్ బంకును, అలాగే జైల్‌లో కొత్త భవనాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిమాండ్ ఖైదీల కోసం వారి ఉపాధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అలాగే జైళ్ల మరమ్మతుల కోసం, కొత్త భవనాల కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని తెలిపారు. ఆయనతో పాటు జైళ్ల శాఖ డీఐజీ డాక్టర్ వరప్రసాద్, ఎస్పీ అస్మి, ఏఎస్పీ వి. భీమారావు, భీమవరం డీఎస్పీ ఆర్‌జీ జయసూర్య, వన్‌టౌన్ సీఐ నాగరాజు, జైలు సూపరింటెండెంట్ డి.వెంకటగిరి తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి ఇంటి వద్ద

హై టెన్షన్

▸▸ కొల్లేరు వాసుల నిరసన పిలుపుతో పోలీసులు అప్రమత్తం

▸▸ 2 చెక్ పోస్టులు ఏర్పాటుచేసి తనిఖీలు

దెందులూరు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి):దెందులూరు మండలం కొండల రావుపాలెంలో మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఇంటి వద్ద హై టెన్షన్ నెలకొంది. ఇంటి చుట్టూ పెద్ద ఎత్తున పోలీసులు, ప్రత్యేక బలగాలు భారీగా మోహరించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగ కుండా ముందస్తు చర్యలు తీసుకున్నారు. వైసీపీ అధికారంలో ఉండగా అబ్బయ్య చౌదరి కొల్లేరు గ్రామస్థులకు లీజు చెల్లించకుండా ఇబ్బందులు పెట్టారని, తమకు రావాల్సిన బాకీ సొమ్ము చెల్లించాలని తాము శాంతియుతంగా నిరసన చేపడుతున్నామని, తమకు మద్దతు ఇవ్వాలని కొల్లేరు సంఘం నాయకుల అభ్యర్థించారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో నూజివీడు డీఎస్పీ, సీఐతో పోలీసులు నిఘా ఏర్పాటు చేశారు. అబ్బయ్య చౌదరి విదేశాల నుంచి తిరిగి రావడంతో ఆ ఇంటి వద్ద ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా గ్రామంలోకి బయట వ్యక్తులను రానివ్వకుండా వాహనాలను తనిఖీ చేశారు. మోటార్ సైకిళ్లను సైతం తనిఖీ చేసిన తర్వాతనే వారిని అనుమతించారు. దీంతో కొండల రావుపాలెంలో హైటెన్షన్ వాతావరణం నెలకొంది. దెందులూరు నియోజకవర్గంలో గత టీడీపీ ప్రభుత్వం బీసీ వర్గీయులకు కేటాయించిన పనిముట్లను వారికి ఇవ్వకుండా అబ్బయ్య చౌదరి అమ్ముకున్నారని, వెంటనే బీసీల వర్గీయులకు పనిముట్లు అందించాలని వారు కూడా వచ్చే అవకాశం ఉండటంతో పెదవేగి సీఐ, ఎస్ఐ, ప్రత్యేక పోలీసు బలగాలు మొహరించి మాజీ ఎమ్మెల్యే ఇంటి వద్ద బందోబస్తు నిర్వహిస్తు న్నారు. డీఎస్పీ శ్రావణ్‌కుమార్, సీఐ రాజశేఖర్, ఎస్‌ఐల ఆధ్వర్యంలో చెక్ పోస్టులతో తనిఖీ చేస్తున్నారు. కాగా కొల్లేరులంక గ్రామస్థులు కొండలరావు పాలెం రాకపోవడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

తల్లి పాలతో బిడ్డకు రోగ నిరోధక శక్తి



వరహాపట్నంలో మాట్లాడుతున్న సర్పంచ్

కైకలూరు, ఆగష్టు 1(ఆంధ్రజ్యోతి): తల్లిపాలతో పిల్లల్లో రోగ నిరోధక శక్తి పెరుగుతుందని సర్పంచ్ ఉప్పలపాటి నాగమణి అన్నారు. శుక్రవారం తల్లిపాల వారోత్సవాలను కైకలూరు మండలం వరహాపట్నంలో ప్రారంభించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించి తల్లిపాల విశిష్టతపై అవగాహన కల్పించారు. ఐసీడీ ఎస్ సూపర్‌వైజర్ శ్యామలగౌరి మాట్లాడుతూ తల్లిపా లతో పిల్లల ఎదుగుదలకు ఎంతో ఉపయోగపడ తాయన్నారు. అంగన్వాడీ టీచర్లు బి నాగలక్ష్మీ, బి. తనూజ, సీహెచ్ ఆశాలత, ఆశావర్కర్లు సుభాషిణి, సుజాత, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

నూజివీడు టౌన్: తల్లిపాల ద్వారా బిడ్డకు సంపూర్ణ పౌష్టిక ఆహారం లభిస్తుందని నూజివీడు సిడిపివో విజయ్ కుమారి అన్నారు. నూజివీడు పట్టణం బాపు నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవ కార్యక్రమాన్ని ఆమె లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ బిడ్డలో మానసిక ఎదుగుదల రోగనిరోధక శక్తి పెంచేందుకు తల్లిపాలు అవశ్యకత ఎంతైనా ఉందన్నారు. అంగన్‌వాడీ సూపర్ వైజర్ ధనలక్ష్మీ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: తల్లిపాలతో ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించవచ్చునని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జి. రాగమయి అన్నారు. బొద్దనపల్లిలో శుక్రవారం తల్లులకు అవగాహన కల్పించారు.

ఇల్లా.. స్థలమా!

(3వ పేజీ తరువాయి)

కావొచ్చింది. ఈనెల 15వ తేదీ నాటికి పట్టాలు పంపిణీకి సిద్ధం కావాల్సిందిగా జిల్లా యంత్రాంగానికి పరోక్ష సంకేతాలు పంపారు. ఆమేరకు ఇప్పటికే కలెక్టర్ అధ్యక్షతన ఇంటి జాగాల దరఖాస్తులపై సమీక్ష సాగింది. వచ్చిన చిక్కల్లా ఏమిటంటే ఇప్పటికే అర్హు లైన వారంతా పూర్వ జగనన్న కాలనీల్లో ఇంటి స్థలం లభించి ఆ మేరకు నిర్మాణంకు సన్నద్ధం కాలేనివారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని కొంత కాలం పాటు ఆనోట ఈనోట ప్రచారం సాగింది. కాని దీనిపై యంత్రాంగం స్పష్టత ఇవ్వలేదు. అయితే ఇప్పటికే దరఖాస్తు చేసు కున్న వారంతా తమకు ఎక్కడా ఇంటి జాగా రాలేదని, పార్టీ పక్షపాతంగా తమను పక్కన పెట్టారని కొందరు, సమాచారం లేకపోవడంతో సరైన సమయంలో తాము దరఖాస్తు చేసుకోలేదని ఇంకొందరు పేర్కొంటూ తాజాగా దరఖాస్తులకు సిద్ధమయ్యారు. వీటి పరిశీలన, అందచేత ఎప్పుడు అనేదే ఇప్పటికీ లబ్ధిదారుల్లో ఉత్కంఠగా మారింది. దీనికి ప్రభుత్వం ఒక స్పష్టత ఇస్తేనే తప్ప లబ్ధిదారుల్లో ఉన్న మీమాంస తీరడానికి మార్గమేలేదు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

ముసునూరు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): గర్భవతులు, బాలింతలు సక్రమంగా పౌష్టికాహారం తీసుకున్నప్పుడే సంపూర్ణ ఆరోగ్యం సమకూరుతుందని ఐసీడీయస్ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి అన్నారు. ముసునూరు అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం ఆమె పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. మాతా శిశు మరణాలను నివారించేందుకు ప్రభుత్వం అంగన్ వాడీల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని గర్భవతులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్త ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడి ఫోన్ హ్యాక్ చేసిన సైబర్ నేరగాళ్ళు

చాట్రాయి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): టీడీపీ చాట్రాయి మండల ప్రధాన కార్యదర్శి తేళ్ళూరి శేఖర్ ఫోన్‌ను సైబర్ నేరగాళ్ళు హ్యాక్ చేశారు. ఆయన వాట్సాప్ నంబర్ నుంచి శుక్రవారం ఎస్‌బీఐ రివార్డ్సు పేరుతో లింకులను టీడీపీ గ్రూపుల్లో పోస్టు చేశారు. వెంటనే అప్రత్తమైన శేఖర్ తన వాట్సాప్ అకౌంట్‌ను డిలీట్ చేశారు. ఈ లింకులు ఎవరూ ఓపెన్ చెయ్యవద్దని, లింక్ ఓపెన్ చేస్తే బ్యాంకులో ఉన్న డబ్బులు పోతాయని ఓ వ్యక్తి పోస్టు పెట్టారు. ఈ విషయమై శేఖర్‌ను వివరణ కోరగా తాను కొన్ని రోజుల క్రితం పాన్‌కార్డు కోసం ఆన్‌లైన్ లింక్‌లో వివరాలు నమోదు చేసి ఓటీపీ అడిగే సరికి వెనక్కి వచ్చానని అప్పుడే ఫోన్ హ్యాక్ అయ్యి ఉంటుందని అనుకుంటున్నాని, తన అకౌంట్ నుంచి డబ్బులు మాత్రం పోలేదని అన్నారు. దీనిపై పోలీసుల ఫిర్యాదు చేస్తానని, ఎవరూ సామాజిక మాధ్యమాలలో వచ్చే లింకులను ఓపెన్ చెయ్య వద్దని శేఖర్ కోరారు.

మంత్రిపై అసభ్య పోస్టు పెట్టిన వ్యక్తిపై కేసు నమోదు

చాట్రాయి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): నూజివీడు ఎమ్మెల్యే, గృహనిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథిపై ఫేస్‌బుక్‌లో అసభ్య పోస్టు పెట్టిన మండలంలో పోలవరం గ్రామానికి చెందిన వడాలి శ్రీనివాసరాజుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై డి. రామకృష్ణ తెలిపారు. పోతనపల్లి టీడీపీ నాయకులు ఫిర్యాదు చేశారన్నారు. సోషల్ మీడియాలో అసభ్యకర, విద్వేషాలు రెచ్చగొట్టే పోస్టులు పెట్టే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

యువకుడి అనుమానాస్పద మృతి



చందు మృతదేహం

మండవల్లి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): భైరవపట్నం గ్రామానికి చెందిన యువకుడు చెరువులో పడి మృతి చెందిన ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. పోలీ సుల వివరాల ప్రకారం భైరవపట్నం గ్రామానికి చెందిన పండు జోజి పెద్దకుమారుడు తరుణ్ అలి యాస్ చందు(23) జూలై 31వ తేదీ మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. మరుస టిరోజు ఉదయం వారి ఇంటి పక్కన ఉన్న చేపల చెరువులో చనిపోయి ఉండటాన్ని గమనించారు. ప్రమాదవశాత్తు చెరువులో జారిపడి మృతి ఉండ వచ్చని కుటుంబ సభ్యులు తెలిపారు. సమా చారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని చేరుకుని మృతదేహాన్ని కైకలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి, అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

జూదరుల అరెస్టు

నూజివీడు టౌన్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): నూజివీడు మండలం పాత రావిచర్లలో పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. ఏడుగురు జూదరులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ. 4370 రూపా నగదు స్వాధీనం చేసుకున్నట్లు నూజివీడు రూరల్ ఎస్‌ఐ జ్యోతిబసు తెలిపారు.